# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ 29.12.2024 | 24 క్యారెట్లు 79,215.00 | కిలో వెండి 98,756.00 | 30°C | సంపుటి:3 | సంచిక:67

www.vishalabharati.com




# కంటికి ఇంపైన కళాత్మక సౌధం...

..మిగతా 4 లో

ఏకో ఫ్రెండ్లీ నిర్మాణ శైలితో ఆకట్టుకునే విల్లా

విలాసవంతమైన ఇంటికి మచ్చుతునక

జేబీ ఇన్‌ఫ్రా ఫౌండర్ ప్రతాప రెడ్డి హోం టూర్







# కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు
- సిక్కు మత సాంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు
- హాజరైన రాష్ట్రపతి, ప్రధాని, కాంగ్రెస్ అగ్రనేతలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చివరి మజిలీ ముగిసింది. ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్ లో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. కేంద్ర ప్రభుత్వ అధికారలాంఛనాలతో మన్మోహన్ పార్థివదేహానికి అధికారులు అంత్యక్రియలను పూర్తిచేశారు. అంతిమ సంస్కారాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్ ఖడ్ , ప్రధాని నరేంద్ర మోదీ, భూటాన్ రాజు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సహా ఇతర కేంద్రమంత్రులు హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్‌తో పాటు ఆ పార్టీ పాలిత రాష్ట్రాల సీఎంలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.వారంతా వరుసగా మన్మోహన్ పార్థివదేహానికి సైనిక లాంఛనాల నడుమ పుష్పగుచ్ఛాలు సమర్పించారు. అనంతరం మన్మోహన్ పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పుష్పగుచ్ఛం సమర్పించి సెల్యూట్ చేశారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ తో పాటు త్రివిధ దళాధిపతులు మన్మోహన్ భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించారు. తర్వాత గౌరవ వందనం చేసిన త్రివిధదళాల అధికారులు పేటికపై ఉన్న పూలు, జాతీయ జెండాను తొలగించారు. మన్మోహన్ బంధువులు, మతపెద్దలతో పాటు రాహుల్ గాంధీ పాడే మోస్తూ నిగమ్ బోధ్ ఘాట్ లో చితి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ సిక్కు మత సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు నిర్వహించిన అనంతరం చితిని పేర్చి పార్థివదేహాన్ని దహనం చేశారు.



# ఆర్ఆర్ ఆర్‌కు టెండర్లు

## ఆహ్వానించిన కేంద్ర ప్రభుత్వం

- రూ.7104 కోట్లతో ఉత్తర భాగం నిర్మాణం
- గిర్మాపూర్ నుంచి తంగడపల్లి వరకు ఎక్స్‌ప్రెస్ వే
- 5 ప్యాకేజీలుగా పనుల విభజన
- రెండేళ్లలో పూర్తిచేయాలని నిబంధన
- ట్రిపుల్ ఆర్ సూపర్ గేమ్ ఛేంజర్ అవుతుంది
- కాంగ్రెస్ పార్టీ ఏడాదిలో సాధించిన విజయం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగంలో నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. గిర్మాపూర్ నుంచి యాదాద్రి వరకు ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం



..మిగతా 2 లో



# తగ్గేదేలే..!

- కొత్త ఏడాదిలో మళ్లీ కూల్చివేతలు
- కబ్జాకోరులను వదిలిపెట్టేది లేదన్న హైడ్రా
- కూల్చివేతలకు సిద్ధంగా ఉన్న 15 బృందాలు
- చెరువుల హద్దుల నిర్ణయం తర్వాత దూకుడు
- త్వరలో హైడ్రా కోసం ఎఫ్ఎం రేడియో
- కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు

..మిగతా 2 లో

# రేపు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

- కేబినెట్ భేటీ వాయిదా
- మాజీ ప్రధాని మన్మోహన్‌కు సంతాపం
- ఉత్తర్వులు జారీ చేసిన అసెంబ్లీ కార్యదర్శి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ అసెంబ్లీ డిసెంబర్ 30వ తేదీన ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కి తెలంగాణ అసెంబ్లీ సంతాపం తెలపనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా సమావేశం కానుంది. సంతాప దినాల్లో భాగంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు

..మిగతా 2 లో



# మందుబాబులకు పండగే

- డిసెంబర్ 31న ఫుల్ పర్మిషన్
- అర్ధరాత్రి దాకా వైన్స్ ఓపెన్
- రాత్రి 1 గంట వరకూ బార్లు, రెస్టారెంట్లు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

డిసెంబర్ 31 వస్తే చాలు మందుబాబులకు ఎక్కడలేని ఉత్సాహం వస్తోంది. ఆ రోజు మద్యాన్ని మంచి నీళ్లలా తాగేస్తారు. గడిచిన ఏడాదిని గుర్తు చేసుకుంటూ పీకలదాకా తాగేస్తారు. ఈ ఏడాది డిసెంబర్ 31కు కూడా రెడీ అయిపోయారు. ఈ నేపథ్యంలో మందుబాబులకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. ఈ నెల 31న వైన్ షాపులు. బార్లు, రెస్టారెంట్లు అదనపు గంటలు తెరిచి ఉంచనున్నారు. వైన్ షాపులు

..మిగతా 2 లో

# సాగర్ డ్యామ్ వద్ద హైడ్రామా

- డ్యాం భద్రత నుంచి తొలుత వైదొలగిన సీఆర్పీఎఫ్
- మళ్లీ సాయంత్రానికే తిరిగి రాక
- అసెంబ్లీ ఎన్నికల టైంలోనూ ఇదే రచ్చ



..మిగతా 2 లో

# సాగు భూములకే రైతు భరోసా

- రిమోట్ సెన్సింగ్ ద్వారా సాగు విస్తీర్ణం గుర్తింపు
- సర్వే నంబర్ల వారీగా వివరాల సేకరణ
- రైతుల పేర్లు నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు
- సంక్రాంతి తర్వాత ఖాతాల్లో నిధుల జమ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు



..మిగతా 3 లో

# పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం

- యువతను బుక్స్‌వైపు మళ్లించాలి
- ఫంక్షన్లలో బొకేలకు బదులు పుస్తకాలివ్వండి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

..మిగతా 2 లో



# కేటీఆర్‌కు ఈడీ నోటీసులు

- ఫార్ములా ఈ–రేస్ కేసులో కీలక పరిణామం
- విచారణలో వేగం పెంచిన అధికారులు
- జనవరి 7న విచారణ రావాలని పిలుపు
- ఆయనతో పాటు అరవింద్, బీఎల్ఎన్‌రెడ్డికి కూడా
- జనవరి 2, 3 తేదీల్లో రావాలని ఆదేశాలు
- అరెస్టు చేస్తారేమోనని బీఆర్ఎస్‌లో టెన్షన్
- కేటీఆర్ నేరపూరిత ప్రవర్తనకు పాల్పడ్డాడు
- కేబినెట్ అనుమతి లేకుండానే నిధుల చెల్లింపులు
- రూ.55 కోట్లు బదిలీ చేయాలని అధికారులపై కేటీఆర్ ఒత్తిడి
- దర్యాప్తును అడ్డుకొనేందుకే కోర్టును ఆశ్రయించారు
- ఆయన పిటిషన్‌ను కొట్టివేయాలి
- హైకోర్టులో ఏసీబీ కౌంటర్‌దాఖలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఫార్ములా ఈరేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు శనివారం నాడు ఈడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 7న విచారణకు రావాలని పేర్కొంది. ఆయనతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డికి కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు ఇచ్చింది. జనవరి 2, 3న విచారణకు రావాలని అరవింద్, బీఎల్ఎన్ రెడ్డికి ఇచ్చిన నోటీసుల్లో తెలిపింది. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది.

**కేటీఆర్ తప్పు చేశాడు: ఏసీబీ**

ఇదిలా ఉండగా ఫార్ములా ఈరేస్ ఒప్పందాలతో మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వానికి నష్టం కలిగించటం ద్వారా నేరపూరిత దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని హైకోర్టులో ఏసీబీ శుక్రవారం కౌంటర్ సమర్పించింది. కేబినెట్, ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా చెల్లింపులు చేయాలని ఆయన ఆదేశించడం

..మిగతా 3 లో

# రేపు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

మొదటిపేజీ తరువాయి భాగం

నివాళులు అర్పించనుంది. శాసనసభ ప్రత్యేక సమావేనికి సంబంధించి అసెంబ్లీ కార్యదర్శి వినరసింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ స్పీకర్.. మూడో తెలంగాణ శాసనసభ నాల్గవ సెషన్ రెండవ సమావేశాన్ని 2024 డిసెంబర్ 30వ తేదీ (సోమవారం) ఉదయం 10.00 గంటలకు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.మరోవైపు డిసెంబర్ 30వ తేదీన జరగాల్సిన తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా పడింది. ఈ నెల 30న సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం జరగనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాప దినాల కారణంగా ఈ నెల 30వ తేదీన జరగాల్సిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. సంతాప దినాలు ముగిసిన తర్వాత కేబినెట్ సమావేశం జరిగే అవకాశం ఉంది.

# ఆర్ఆర్ ఆర్‌కు టెండర్లు

మొదటిపేజీ తరువాయి భాగం

చేపట్టనున్నారు. మొత్తం ఐదు భాగాలుగా విభజించి.. రూ.7,104 కోట్లతో మొత్తం 161.5 కి.మీ మేర రహదారి నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు. రెండేళ్లలో ఆర్ఆర్ఆర్ నిర్మాణం పూర్తి చేయాలని నిబంధనల్లో పొందుపర్చారు.

ప్యాకేజీ 1: సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్‌రెడ్డిపల్లి(34.518.మీ).

ప్యాకేజీ 2: రెడ్డిపల్లి నుంచి ఇస్లాంపూర్ వరకు 26 కి.మీ నిర్మాణం.

ప్యాకేజీ 3: ఇస్లాంపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు 23 కి.మీ నిర్మాణం.

ప్యాకేజీ 4: ప్రజ్ఞాపూర్ నుంచి యాదాద్రి జిల్లా రాయగిరి(43 కి.మీ)

ప్యాకేజీ 5: రాయగిరి నుంచి తంగడిపల్లి వరకు 35 కి.మీ నిర్మాణం

గేమ్ ఛేంజర్ కానుంది: మంత్రి కోమటిరెడ్డి కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలవడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవ, తన కృషికి దక్కిన ఫలితమే ఆర్ఆర్ఆర్ టెండర్లు అని అన్నారు. ''రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే రోజు ఇది. ఆర్ఆర్ఆర్ కోసం ఎన్నోసార్లు సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లాను. కేంద్ర మంత్రి గడ్కరీకి ఎన్నోసార్లు వినతులు ఇచ్చాం. ఆర్ఆర్ఆర్.. తెలంగాణ బిడ్డల భవిష్యత్‌కు బంగారు బాట వేస్తుంది. ఓఆర్ఆర్ లాగే.. ఆర్ఆర్ఆర్ సూపర్ గేమ్ ఛేంజర్ అవుతుంది. 5 భాగాలుగా ఉత్తర భాగం ఆర్ఆర్ఆర్ పనులు చేపడతాం. కాంగ్రెస్ పార్టీ ఏడాదిలోనే సాధించిన అద్భుత విజయం ఇది'' అని అన్నారు.



# మందుబాబులకు పండగే

మొదటిపేజీ తరువాయి భాగం

అర్ధరాత్రి 12 గంటల వరకు.., బార్లు, రెస్టారెంట్లు, ఈవెంట్ల పర్మిషన్లను ఒంటి గంట వరకు పొడిగించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులిచ్చింది. ఈ వేడుకల్లో డ్రగ్స్ వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సర్కార్ ఆదేశించింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఈవెంట్లు, పార్టీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించింది.

**పోలీసుల ఆంక్షలు.. లౌడ్ స్పీకర్లు బంద్**

ఇక న్యూఇయర్ వేళ పోలీసులు ఆంక్షలు విధించారు. హైదరాబాద్‌లోని 3 కమిషనరేట్లు పరిధిలో ఈ న్యూ ఇయర్ వేడుకలపై కఠిన ఆంక్షలు అమలు చేయనున్నారు. న్యూ ఇయర్ ఈవెంట్లు నిర్వహిస్తున్నవారు కచ్చితంగా అనుమతి ముందుగానే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా పార్టీలు, పబ్బుల్లో మైనర్లకు ఎంట్రీ ఉండకూడదన్నారు. డిసెంబర్ 31వ తేదీ ఔట్‌డోర్‌లో రాత్రి 10 దాటిన తర్వాత లౌడ్ స్పీకర్లు బంద్ చేయాలని పోలీసులు ఆదేశించారు. పార్టీలు నిర్వహించేటప్పుడు 45 డెసిబుల్స్‌కు మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇండోర్ మ్యూజికల్ ఈవెంట్స్ నిర్వహించేవారు ఈ నిబంధనలు కచ్చితంగా గుర్తుపెట్టుకోవాలని సూచించారు.

**అసభ్యకర డ్యాన్సులు చేస్తే జైలుకే**

బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర డ్యాన్సులు కూడా నిషిద్ధమని... డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే భారీగా జరిమానా విధిస్తామని చెప్పారు. రూ. 10 వేలు ఫైన్ విధించడంతో పాటు ఆరు నెలలపాటు జైలు శిక్ష కూడా ఉంటుందని హెచ్చరించారు. రోడ్లపై ఇతరులకు ఇబ్బందులు కలిగేలా విచ్చలవిడిగా తిరగటం, పిచ్చి వేషాలు వేయటం, అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించటం వంటివి చేస్తే కేసులు బుక్ చేస్తామని హెచ్చరించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఇతరుల ప్రైవసీకి భంగం కలగకుండా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

# తగ్గేదేలే..!

- కొత్త ఏడాదిలో మళ్లీ కూల్చివేతలు
- కబ్జాకోరులను వదిలిపెట్టేది లేదన్న హైడ్రా
- కూల్చివేతలకు సిద్ధంగా ఉన్న 15 బృందాలు
- చెరువుల హద్దుల నిర్ణయం తర్వాత దూకుడు
- త్వరలో హైడ్రా కోసం ఎఫ్ఎం రేడియో
- కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కొత్త సంవత్సరంలో హైడ్రా మరింత దూకుడు పెంచుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. కూల్చివేతలు ఆగలేదు.. ఇంకా ఉంటాయని స్పష్టంచేశారు. చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్ జరుగుతోందని అన్నారు. స్పష్టత రాగానే హైడ్రా యాక్టివ్‌గా ఉంటుందని తెలిపారు. చెరువులను అభివృద్ధి చేస్తూ.. అక్రమ నిర్మాణాలు కూల్చేస్తామని స్పష్టం చేశారు. FTL నిర్ధారణ అనంతరం అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని చెప్పారు. ఇందుకోసం 15 హైడ్రా బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుందని తేల్చిచెప్పారు. అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. 2024 జూలై 19వ తేదీన హైడ్రా ఆవిర్భవించిందని అన్నారు. హైడ్రా 5 నెలల పని తీరు, వచ్చే ఏడాది కార్యాచరణను ప్రకటిస్తున్నామని రంగనాథ్ తెలిపారు. ఇవాళ(శనివారం) హైడ్రా కార్యాలయంలో రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. ORR లోపల.. 2050 కిలోమీటర్ల పరిధి.. తెలంగాణలో 33 శాతం హైడ్రా పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల భూమిని కాపాడిందని గుర్తుచేశారు.

**హైడ్రా కోసం ఎఫ్ఎం రేడియో..**


ఇప్పటివరకు 8 చెరువులు, 12 పార్కులను కాపాడామని అన్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లపై ప్రజల్లో అవగాహన పెరిగిందని రంగనాథ్ పేర్కొన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా 1025 చెరువుల హద్దులను ఏర్పాటు చేస్తున్నామని రంగనాథ్ చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా సమాచారం చేరవేయడం కోసం ఓ ఎఫ్ఎం రేడియో ప్రారంభిస్తామని తెలిపారు. జూలై 19వ తేదీకు ముందు తర్వాత అక్రమ కట్టడాలను శాటిలైట్ ఇమేజ్ ద్వారా గుర్తిస్తున్నామని అన్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయడమే హైడ్రా పని కాదని.. 12 చెరువులను పునరుద్ధరణ చేస్తున్నామని చెప్పారు.డీఆర్ఎఫ్‌లో 72 టీమ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఓఆర్ఆర్ వరకు డీఆర్ఎఫ్ పని చేస్తుందన్నారు. కొంత మంది హైడ్రాపై అసత్య ప్రచారం చేస్తున్నారు.. దానిని ఖండిస్తున్నామని రంగనాథ్ అన్నారు.

**ఓఆర్ఆర్ వరకూ హైడ్రా పరిధి..**

''హైడ్రా ఏర్పడి దాదాపు 5 నెలలు దాటింది. ఐదు నెలల అనుభవాలు, వచ్చే ఏడాది రూట్ మ్యాప్ సిద్ధం చేశాం. ఓఆర్ఆర్ వరకు హైడ్రా పరిధి ఉంది. జీహెచ్ఎంసీ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను కేటాయించింది. 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించాం. 12 చెరువులు, 8 పార్కులను అన్యాక్రాంతం కాకుండా హైడ్రా కాపాడింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై ప్రజల్లో అవగాహన పెరిగింది.1095 చెరువుల్లో వచ్చే ఏడాది ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. సాంకేతిక పరిజ్ఞానం, డాటాతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. ఎఫ్‌టీఎల్‌ను పారదర్శకంగా చేయడం మా బాధ్యత. శాటిలైట్ ఇమేజ్‌తో అత్యంత రెజల్యూషన్ ఉన్న డేటా తీసుకుంటున్నాం. 2006 నుంచి 2023 వరకు ఏరియల్ డ్రోన్స్‌తో తీసిన ఫొటోలను కూడా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం తీసుకుంటున్నాం. ఎఫ్‌టీఎల్ మారడానికి గల కారణాలు స్పష్టంగా తెలుస్తుంది. శాస్త్రీయమైన పద్ధతుల్లోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతుంది. నాలాలపై కిర్లోస్కర్ కంపెనీ చేసిన స్టడీని తీసుకుంటున్నాం. 5800 ఫిర్యాదులు హైడ్రాకు అందాయి. అనధికారిక నిర్మాణాలకు సంబంధించి 27 పురపారక సంఘాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి'' అని రంగనాథ్ పేర్కొన్నారు.

**ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్..**

''27 పురపాలక సంఘాలపై కూడా మాకు అధికారం ఉంది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నాం. భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై కూడా దృష్టి పెట్టాం. 2025లో జియో ఫెన్సింగ్ సర్వే చేస్తాం. 12 చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే 72 డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయి. నాగోల్‌లో ఉన్న డీఆర్ఎఫ్ కేంద్రాన్ని బలోపేతం చేస్తాం. త్వరలోనే నగరంలో మరో డాప్లర్ వెదర్ రాడార్ రాబోతుంది. వెదర్ డాటాను విశ్లేషించేందుకు హైడ్రాలో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నాం. హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్ఎం ఛానల్‌కు ప్రయత్నిస్తున్నాం. హైడ్రా వల్ల ప్రజల్లో భూములు, ఇల్లు క్రయవిక్రయాలపై అవగాహన పెరుగుతుంది. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుంది. జూలై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవాటిపై చర్యలు తప్పవు. వచ్చే ఏడాది నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న షెడ్లపై ప్రజలెవరు అద్దెకు తీసుకోవద్దు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నాం'' అని రంగనాథ్ వెల్లడించారు.



# పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం


- యువతను బుక్స్‌వైపు మళ్లించాలి
- ఫంక్షన్లలో బొకేలకు బదులు పుస్తకాలివ్వండి
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించి మాట్లాడారు. ''పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంది. నిరక్షరాస్యుల కోసం ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. పుస్తకాలను నమిలి మింగేయాలనేంత క్షుణ్ణంగా చదవాలి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సంప్రదాయబద్ధంగా పుస్తకాల్ని ప్రమోట్ చేస్తోంది. మానవ నాగరికత వర్ధిల్లినంతకాలం పుస్తకాలు ఉంటాయి. ఈబుక్స్ కంటే పుస్తకాల్లోనే మజా ఉంటుంది. రచయితతో డైరెక్ట్‌గా మాట్లాడుతున్నట్టు ఉంటుంది. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందే. ఈపుస్తకాలు చదివితే ఆ ఫీల్ ఉండదని పలువురు చెబుతున్న మాట. పెద్దలు అందరూ యువతను పుస్తకాల వైపు ప్రోత్సహించాలి'' అని గవర్నర్ సూచించారు.

# అన్నా యూనివర్సిటీ రేప్ కేసుపై సిట్

- దర్యాప్తు అధికారులుగా మహిళా ఐపీఎస్‌లు
- బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం
- మద్రాస్ హైకోర్టు సంచలన నిర్ణయం



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

అన్నాయూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసు విచారణకు మద్రాసు హైకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ అధికారులుగా మహిళా ఐపీఎస్‌లనే నియమిస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. ఐపీఎస్ అధికారిణిలు స్నేహప్రియ, ఆయ్మన్ జమాల్, బృంద నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది.

డిసెంబర్ 23న అన్నాయూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థినిపై ఇద్దరు యువకులు అత్యాచారం చేశారు. విద్యార్థినితో ఉన్న ఆమె స్నేహితుడ్ని తీవ్రంగా కొట్టి ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ కేసులో పోలీసుల ఎఫ్ఐఆర్ లీకవడం వల్ల బాధితురాలి వ్యక్తిగత వివరాలు బయటకురావడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. కేసును సుమోటాగా స్వీకరించింది మద్రాస్‌హైకోర్టు. అయితే, సాంకేతిక లోపం తలెత్తడం వల్లే ఎఫ్ఐఆర్ లీకై ఉండొచ్చని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు.

ఎఫ్ఐఆర్ లీకవడం వల్ల బాధితురాలికి జరిగిన నష్టానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. కేసు వివరాలు మీడియాకు వెల్లడించినందుకు చెన్నై పోలీసు కమిషనర్‌పై అవసరమైతే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. బాధితురాలికి చదువుకున్నన్ని రోజులు ఉచిత విద్య, బోర్డింగ్, లాడ్జింగ్, కౌన్సెలింగ్ సౌకర్యాలను కల్పించాలని అన్నా యూనివర్సిటీని హై కోర్టు ఆదేశించింది. మహిళలు, పిల్లలపై లైంగిక నేరాల కేసుల్లో ఎఫ్ఐఆర్ లీకేజీ జరగకుండా చూసుకోవాలని తమిళనాడు డీజీపీని ఆదేశించింది.

# సాగర్ డ్యామ్ వద్ద హైడ్రామా

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. జల వివాదం నేపథ్యంలో నాగార్జుసాగర్ డ్యామ్ పర్యవేక్షణ బాధ్యతలను కేఆర్ఎంబీ.. సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించింది. ఇరు వైపులా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఎస్‌పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ వైపు విధులు నిర్వహిస్తోన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు పర్యవేక్షణ బాధ్యతను ఉపసంహరించుకున్నాయి. వారి స్థానంలో ఎస్‌పీఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. అదే సమయంలో డ్యామ్ వద్ద విధుల్లో కొనసాగాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో తెలంగాణ వైపు మళ్లీ సీఆర్‌పీఎఫ్ బలగాలు బాధ్యతలు తీసుకున్నాయి. ఈ విషయంపై డ్యామ్ ఎస్ఈ శ్రీధరరావును వివరణ కోరగా.. సీఆర్‌పీఎఫ్ బందోబస్తు గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని.. ఈ విషయాన్ని కేఆర్ఎంబీ చూస్తుందని తెలిపారు. సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్ సహీర్ వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఉదయం డ్యాంపై భద్రతను ఉపసంహరించి.. సాయంత్రం తిరిగి విధుల్లోకి చేరినట్లు చెప్పారు.



## కన్నీటి వీడ్కోలు





# పేదల దేవుడు పీజేఆర్

**నిత్యం ప్రజాసమస్యల కోసమే పోరాటం**

**సీఎం రేవంత్ రెడ్డి నివాళులు**

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పేద ప్రజలకు అన్ని వేళలా అండగా నిలిచిన గొప్ప వ్యక్తి పి.జనార్ధన్ రెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. శనివారం పీజేఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి సీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 1994 నుంచి 1999 వరకు సీఎల్పీ నేతగా ఆయన పనిచేసిన ఆయన నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడారని, తెలంగాణ వాదానికి బలమైన గొంతుకగా నిలిచారని సీఎం తెలిపారు. పీజేఆర్ చేసిన సేవలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు.

# సాగు భూములకే రైతు భరోసా

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రైతు భరోసా పథకం అమలుకు రేవంత్ రెడ్డి సర్కార్ మూహుర్తం ఖరారు చేసిన విషయం తెలిసిందే. సంక్రాంతి కానుకగా రైతు భరోసా పథకాన్ని అమలు చేసి.. అన్నదాతల అకౌంట్లలో డబ్బులు వేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులు పలు వేదికలపై కీలక ప్రకటనలు చేశారు. అయితే.. పథకం అమలు కోసం ప్రభుత్వం ఇప్పటికే క్షేత్రస్థాయిలో కసరత్తు చేసింది. అయితే.. రైతు భరోసా అమలుకు సంబంధించి శనివారం (డిసెంబర్ 28న) రోజున సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కీలక సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి పండగ నుంచి రైతు భరోసా పథకాన్ని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలపై.. సంబంధిత అధికారులతో మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు. సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం అందించటం తమ ఉద్దేశమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ పథకం అమలులో కచ్చితత్వం కోసం ఉపగ్రహ డేటా వినియోగించబోతున్నట్లు చెప్పుకొచ్చారు. గ్రామాల్లోని సర్వే నంబర్ల వారీగా సాగు వివరాల సేకరణ చేపడుతున్నట్టు తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతుల పేర్లు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా సాగు విస్తీర్ణం గుర్తించే యోచిస్తున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం అంచనా వేయగల కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు.

# కేటీఆర్‌కు ఈడీ నోటీసులు

మొదటిపేజీ తరువాయి భాగం



నిబంధనలకు విరుద్ధమని తెలిపింది. విదేశీ సంస్థకు అనుమతి లేకుండానే రూ.54 కోట్లకు పైగా చెల్లించినట్లు న్యాయస్థానానికి వివరించింది. తద్వారా హెచ్ఎండీఏపై రూ.8 కోట్లకు పైగా భారం పడిందని పేర్కొంది. ఎఫ్ఐఆర్ దాఖలుతోనే అసంబద్ధ కారణాలతో కేసు కొట్టి వేయాలని హైకోర్టును ఆశ్రయించడం దర్యాప్తును అడ్డుకోవటమేనని ఏసీబీ హైకోర్టుకి వెల్లడించింది.

**కేటీఆర్ పిటిషన్ కొట్టేయాలని విజ్ఞప్తి..**

చట్టప్రకారం లేదా వాస్తవాలు పరిశీలించినా కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ విచారణార్హం కాదని, కొట్టివేయాలని ఏసీబీ అధికారులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. మొదటి ఒప్పందం రద్దు కాగా, రెండోది 2023 అక్టోబరు 30న ఎఫ్ఈవో, పురపాలక శాఖ మధ్య జరిగిందన్నారు. అప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉందని చెప్పారు. మూడేళ్లకు ఫార్ములా ఈరేస్ నిమిత్తం రూ.600 కోట్లు వెచ్చించాల్సి ఉందని, ఈసీ అనుమతి లేకుండా ఒప్పందం చేసుకోవటం నియమావళికి విరుద్ధమని ధర్మాసనానికి వివరించారు. 2022 ఒప్పందం ప్రకారం ఫార్ములా ఈరేస్ ట్రాక్ నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ బాధ్యత అని, స్పాన్సర్ తరపున చెల్లింపులు చేయాల్సిన అవసరం లేదని హైకోర్టుకు తెలిపారు. రికార్డుల ప్రకారం మాజీ మంత్రి నేరానికి పాల్పడినట్లు రుజువు అవుతోందని చెప్పారు. కాగ్నిజెన్స్ తీసుకునే కారణాలు ఎఫ్ఐఆర్‌లో ఉంటే ప్రాథమిక విచారణ లేకుండా కేసు నమోదు చేయవచ్చన్న సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేశారు.

**అధికారులదే తప్పన్న కేటీఆర్..**

ఒప్పందాల అమల్లో విధానపరమైన అంశాలను చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులదేనని, మంత్రిగా తన బాధ్యత కాదని కేటీఆర్ హైకోర్టుకు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఏసీబీ దాఖలు చేసిన కౌంటర్‌కి ఆయన రిప్లై కౌంటర్ సమర్పించారు. విదేశీ సంస్థకు డబ్బు చెల్లింపులు, అనుమతులు అధికారులు చూసుకోవాలని పేర్కొన్నారు. హెచ్ఎండీఏ చట్టబద్ధమైన సంస్థ అని, చెల్లింపులు సహా అన్ని అంశాలను అదే చూసుకోవాలని కేటీఆర్ ధర్మాసనానికి వివరించారు. ఈసీ అనుమతి తీసుకోలేదనే ఆరోపణతో సంబంధం లేదని కేటీఆర్ హైకోర్టుకు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత మంత్రిగా విధులు నిర్వహించలేదని, అందువల్ల తాను బాధ్యుడిని కాదన్నారు. ప్రాథమికంగా నేరారోపణ నిర్ధారణ కాకపోవడంతో క్వాష్ పిటిషన్ వేసినట్లు వివరించారు. రూ.10 కోట్లకు పైబడిన చెల్లింపులకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని హెచ్ఎండీఏ నిబంధనల్లో లేదని చెప్పారు. ఒకవేళ ఉన్నా సంబంధిత శాఖ చూసుకోవాలని న్యాయస్థానానికి తెలియజేశారు.

**హెచ్ఎండీఏకు నిబంధనలు వర్తించవు..**

వచ్చే మూడేళ్లకు రూ.600 కోట్లు అనే వాదన సరికాదని, అంచనాలు లేకుండా ఖర్చు పెంచి చూపారని కేటీఆర్ పేర్కొన్నారు. సచివాలయం బిజినెస్ నిబంధనలు హెచ్ఎండీఏకు వర్తించవన్నారు. మిగిలిన 50 శాతం చెల్లించనందునే రూ.55 కోట్ల నష్టంతో పాటు ఇతర ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోవాల్సి వచ్చిందని అన్నారు. నీల్సన్ నివేదిక ప్రకారం సీజన్ 9లో సర్కారుకు 83 మిలియన్ డాలర్ల ఆదాయం సమకూరినట్లు చెప్పారు. నిబంధనల ఉల్లంఘనలతో నిధుల చెల్లింపులు జరిగితే, అది నేరపూరిత చర్యకాదని తెలిపారు. రాజకీయ కక్షతోనే తనపై పెట్టిన కేసును కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టుని కోరారు.



- క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 31 వరకు మ్యాచ్‌లు
- మొదటి బహుమతి 1లక్ష రూపాయలు
- రెండవ బహుమతి రూ.50వేలు
- గత ఎనిమిదేళ్ల నుంచి నిర్వహణ

# జోరుగా కొనసాగుతున్న కుంట్లూరు ప్రీమియర్ లీగ్

## స్పాన్సర్లకు ధన్యవాదాలు తెలిపిన నిర్వాహకులు కరుణాకర్ రెడ్డి, హరీష్ రెడ్డి

విశాలభారతి, పెద్ద అంబర్‌పేట్:

కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగొచ్చిందంటే అందరికీ సంబురమే.. చిన్నారుల నుంచి పెద్దల వరకూ అందరూ సరదాగా గడుపుతుంటారు. అయితే పండుగ సందర్భంగా ఏ ఊరు, వాడ చూసినా క్రీడా పోటీల సందడి కనిపిస్తున్నది. ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్‌లీగ్) తరహాలో కొన్నిచోట్ల ఆ ఊరి పేరుతో ప్రీమియర్ లీగ్‌లు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలో ఎక్కడా లేని విధంగా కుంట్లూరు గ్రామంలో కుంట్లూరు ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) పెట్టారు. గత ఎనిమిది సంవత్సరాల నుండి నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా స్థానిక సీఎన్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో విజయవంతంగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సంక్రాంతికి కూడా కేపీఎల్-9 టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 26న ప్రారంభమైన ఈ టోర్నమెంట్ ఆరు రోజుల పాటు జరగనుంది. సుమారు రూ.10 లక్షల ఖర్చుతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. కుంట్లూరు గ్రామంలో ఉన్న యువతలో మానసిక ఉల్లాసాన్ని, ఐకమత్యంతో కూడిన స్ఫూర్తిని పెంపొందించడం కోసం ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కరుణాకర్ రెడ్డి,హరీష్ రెడ్డిలు తెలిపారు. ప్రతి ఏడాది గ్రామ యువత ఆరు టీములుగా ఏర్పడి కేపీఎల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి నిర్వహించే టోర్నమెంట్‌లో పెద్ద అంబర్‌పేట మున్సిపల్ వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి మొదటి బహుమతి కింద లక్ష రూపాయలు ఇవ్వనున్నారు. అలాగే ఎట్ బెస్ట్ టాక్స్ ఫైలర్ కో ఫౌండర్ బద్దం హరీష్‌రెడ్డి రెండవ బహుమతి కింద రూ.50వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతోపాటు గత ఎనిమిది సంవత్సరాల నుంచి సీఎన్ఆర్ గ్రౌండ్‌ను స్పాన్సర్‌గా ఇస్తున్న చామ రవీందర్ రెడ్డికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఆరు టీములకు స్పాన్సర్లుగా ఉన్న పెద్దిటి శ్రీనివాస్ రెడ్డి, సామ చంద్రశేఖర్ రెడ్డి, గుర్రం దామోదర్ రెడ్డి, కంచర్ల జగన్మోహన్, కిన్నెర సురేశ్, బద్దం శ్రీకాంత్ రెడ్డికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. గత తొమ్మిదేళ్ల నుంచి నిర్వహిస్తున్న కేపీఎల్ టోర్నమెంట్‌కు సహకరిస్తున్న గ్రామ పెద్దలు, స్పాన్సర్‌గా ఉన్న సీమెచ్ విజయ భూషణ్ రెడ్డి, జోర్క శ్రీరాములు ముదిరాజ్, పిట్టల కృష్ణ ముదిరాజ్, సాధు మధు ముదిరాజ్, కందాల శుప్రసేనా రెడ్డి, ఎర్ర మహేందర్, పార్వతి శివకృష్ణారెడ్డి, ఓరుగంటి కొండల్ గౌడ్‌కు కేపీఎల్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు నిర్వాహకులు.










# ఆసరా పెన్షన్లలో కోత..

- కుప్పలు తెప్పలుగా బోగస్ పెన్షన్లు
- రెండేసి పెన్షన్లు పొందుతున్న వేలాది మంది
- విచారణలో వెలుగులోకి వాస్తవాలు

విశాలభారతి, స్టేట్‌బ్యూరో:



రాష్ట్రంలో ఆసరా పింఛన్లలో తవ్విన కొద్దీ అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఇప్పటి వరకు చేసిన విచారణలో వేలాది మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నట్లుగా వెల్లడైంది. వారంతా రెండు రకాల పింఛన్లు తీసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో వారందరికీ పింఛన్లు నిలిపివేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, చేయూత పింఛన్‌దారుల వివరాలను మ్యాచ్ చేస్తూ వెరిఫై చేయగా అసలు కథ వెలుగులోకి వచ్చింది. దాదాపు 5వేలకు పైగా మంది అనర్హుల పేర్లను వెలికితీశారు. ఓ వైపు వేల రూపాయల ఫ్యామిలీ పెన్షన్ పొందుతూనే చేయూత పింఛను తీసుకుంటున్నట్లుగా గుర్తించారు. వారికి పింఛన్‌కట్‌చేయడంతోపాటు గతంలో తీసుకున్న మొత్తాన్ని రికవరీ చేయాలని నిర్ణయించారు. కానీ.. దానికి రాజకీయ రంగు పులుముకోవడంతో గతంలో తీసుకున్న మొతాన్ని వెనక్కి తీసుకోవాలనే నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. సెర్ప్‌ఉద్యోగుల్లో 316 మంది వరకు చేయూత పింఛన్లు కూడా పొందుతున్నట్లుగా గుర్తించారు. దాంతో వారికి చేయూత పింఛన్ నిలిపివేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రంగాలను విచారణ చేస్తే ఇంకా పెద్దఎత్తున అక్రమాలు, అనర్హులు బయటపడుతారని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేయూత పింఛను ద్వారా 45 లక్షల మంది లబ్ధిపొందుతున్నారు. ఇందులో ఐదు లక్షల మంది దివ్యాంగులు ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన పింఛన్లలో ఎక్కువగా అనర్హులు ఉన్నట్లు తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పట్లో సోషల్‌మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టాయి. ఉపాధి హామీ ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వారు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న వారు ఇలా రకరకాలుగా ఉద్యోగులు చేయూత పింఛను పొందుతున్నట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఇందులోభాగంగానే ఆయా విభాగాలపై ఎంక్వయిరీ నడుస్తున్నట్లు తెలుస్తున్నది.



# కంటికి ఇంపైన కళాత్మక సౌధం...

## ఏకో ఫ్రెండ్లీ నిర్మాణ శైలితో ఆకట్టుకునే విల్లా

## విలాసవంతమైన ఇంటికి మచ్చుతునక

## జేబీ ఇన్‌ఫ్రా ఫౌండర్ ప్రతాప రెడ్డి హోం టూర్

చుట్టూ పచ్చని అరుదైన మొక్కలు, అందమైన చెట్లు. విస్తారమైన గాలి, ధారళంగా ప్రసరించే వెలుతురు. వైవిధ్యమైన ఆర్కిటెక్చర్ డిజైనింగ్‌తో ఆకట్టుకునే ఇంటికి ఇదొక నిదర్శనం. నివాసితుల అభిరుచికి అనుగుణంగా, పురాతనమైన ఇంటీరియల్ ఉత్పత్తులతో, ఆధునాతన సాంకేతికతతో కూడిన నందనవనమిదీ. మూడు నెలల కిందట కట్టిన ఇంటి సింహద్వారానికి ఎదురుగా నాటిన ఏండ్ల నాటి దేవగన్నేరు వృక్షం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇక ఇంట్లోకి ప్రసరించే సహజమైన వెలుతురులో, వాస్తు నిర్మాణానికి మోడ్రన్ టచ్‌తో పేర్చిన ఇంద్రభవనమే ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపార దిగ్గజం జేబీ ఇన్‌ఫ్రా వ్యవస్థాపకులు ప్రతాప్ రెడ్డి నివాసం. ఇల్లు అంటే నాలుగు ఇటుకలు పేర్చి, ఐదారు గోడలు కట్టి, ఎడెనిమిది అంతస్తులతో కనిపించే సిమెంట్ కట్టడం కాదనీ, ఇంటిలో గడిపినంత సేపు ఆహ్లాదాన్ని పంచుతూ, ఇంటిల్లిపాదికి సంతోషాన్నిచ్చేలా అసలైన ఆవాసం అన్నట్లుగా ఉండేలా మలిచారు. ఇక నిర్మాణ రంగంలో తనకున్న సుదీర్ఘ అనుభవానికి నచ్చేలా చక్కని పొదరింటిని నిర్మించారు. నో ఆర్ నెవర్ అంటూనే, వన్స్ ఫర్ ఆల్ తీరుగా చక్కని ఇంటికి జీవం పోసినట్లుగా నిలుస్తోంది. వైవిధ్యమైన నిర్మాణ శైలి, ఆధునాతన పోకడలకు అనువుగా ఆర్కిటెక్చర్ కుంభం రవి కళారూపంలా చెక్కిన నందనవనంలో రియల్ టాక్ విహారం.

**విశాలభారతి, హైదరాబాద్ :**
దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లోనే అరుదుగా కనిపించే దేవగన్నేరు మహా వృక్షం సింహద్వారానికి ఎదురుగా ఉండి ఇంట్లోకి వచ్చేవారికి ఆలయానికి వచ్చిన భావన కలిగింపజేస్తోంది. ప్రధాన ద్వారం పక్కనే ఐదారు మెట్లు ఎక్కిన తర్వాత విశాలమైన ఇంటికి తగినట్లుగా నిర్మించిన పూజాగది మరింత పాజిటివ్ ఫీల్ తీసుకువస్తోంది. ఇక చుట్టూ అమర్చిన అద్దాల గోడలు ఇంటిని సహజసిద్ధమైన కాంతితో నింపేశాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో అతిపెద్ద లివింగ్ రూం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఒక బెడ్రూం, ఇండోర్ లిఫ్ట్‌తో రెండు అంతస్తులకు చేరుకోవచ్చు. ఈ ప్రాంగణంలోనే వేలాడుతున్నట్లుగా కనిపించే కాంటీలివర్ డిజైనింగ్ మెట్లతో నిర్మించిన డూప్లెక్స్ విల్లా భలేగా ఉంటుంది. ఇక ఇంటికి వచ్చే అతిథులకు వండి వారించేందుకు వీలుగా అతిపెద్ద డైనింగ్ టేబుల్ ఓవైపు, ఈశాన్యం నీరు నిల్వ ఉన్నట్లుగా వాస్తు నిబంధనలకు అనుగుణంగా చుట్టూ నీళ్లు నిండిన పూల్ సిట్ అవుట్ రెండో లివింగ్ హాల్ ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఈ విలాసవంతమైన ఇంటికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ప్రతి బెడ్రూంకు అటాచ్డ్ సిట్‌అవుట్ బాల్కనీ ఉంటుంది. ఉమ్మడి కుటుంబంలో ఉన్నప్పటికీ... వ్యక్తిగత ప్రైవసీకి ప్రాధాన్యతనిచ్చేలా ప్రతి బెడ్రూంను ఏర్పాటు చేశారు. దంపతులిద్దరితోపాటు, కొడుకులు, కోడళ్లు, మనవడు, మనవరాళ్లలతో, వచ్చిపోయే స్నేహితులు, బంధువులకు అనువుగా ఉండేలా విశాలంగా నిర్మించారు.


### దేశీ ఉత్పత్తులతో మోడ్రన్ లుక్...

భోజనం చేసిన వెంటనే డ్రై కిచెన్ ఆనుకుని ఉండే మాస్టర్ డైనింగ్ హాల్ నుంచి నేరుగా టీవీ రూం వెళ్లకుండానే... కాసేపు కూర్చునేందుకు వీలుగా పూల్ సైడ్ హాల్ ఉంటుంది. ఈ రూంలో ఏర్పాటు చేసిన పొడవైన చెక్క బల్ల పాత కాలం నాటి బల్లలు గుర్తుకు తీసుకువస్తాయి. కోఠా ఫ్లోరింగ్ రంగు రాళ్లను ఉపయోగించి, ప్రతి రూమ్‌కు తగినట్లుగా ఉండే ఫ్లోరింగ్, ఇంటీరియర్, తెలంగాణకే గుర్తింపునిచ్చే పోచంపల్లి ఇక్కత్ క్లాత్ వాల్ డిజైన్లు, వేలాడుతూ కనిపించే వాసంపై ట్రాన్స్‌ఫరెంట్‌గా ఉండే మెట్ల గోడలు, మొదటి అంతస్తు నుంచి కూడా చూసేందుకు వీలుగా భారీ ద్వారాలతో ఏర్పాటు చేసిన పూజ గది తలుపుల వరకు అన్ని కూడా దేశీ ఉత్పత్తులతో నిర్మించారు. ఇవే ఈ ఇంటికి మోడ్రన్ లుక్‌ను తీసుకువస్తుంది. ముఖ్యంగా లివింగ్ రూమ్‌ను ఆనుకుని ఉండే రెండో గార్డెన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దేవగన్నేరు చెట్టుతో, తులసీ కోటతో ఇంటిల్లిపాదికి స్పిర్చువల్ వైబ్స్ తాకుతాయి. ఇక స్టార్ హోటల్ సూట్ తరహాలో డిజైన్ చేసిన ప్రతి బెడ్రూం, అటాచ్డ్ మోడ్రన్ బాత్ రూం, డ్రెస్సింగ్ రూం కప్ బోర్డులతో నిండి ఉంటాయి.



### చుట్టూ మొక్కలతో నందనవనం...

ఇంట్లో కూర్చున్నా... ప్రకృతి ఒడిలో సేదతీరిన అనుభూతిని కలిగించేలా ప్రతి రూమ్‌కు అటాచ్డ్ బాల్కనీ గార్డెన్ వ్యూతో ఎంతో బాగుంటుంది. ఇంటి చుట్టూ నాటిన పూల మొక్కలు, తీగలు పారే చెట్లతో తోటలో కూర్చుకున్నామనే భావన కలిగిస్తోంది. ఫ్లోరింగ్ విషయానికి వస్తే మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన రెండూ బెడ్రూంలు, ఒక గెస్ట్ రూంకు ఆనుకుని ఉండే ఫ్యామిలీ సీటర్ హోం థియేటర్ మరో విశేషమే. జీ+2 నిర్మాణంతో చేపట్టిన ఈ ఇంటికి ప్రత్యేకతను తీసుకువచ్చే విషయమేమింటంటే... ప్రతి రూంకు ఆనుకుని ఓపెన్ వ్యూ ఏరియా. హాల్‌లో కూర్చుకున్నా, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నా, బెడ్రూంలో సేద తీరుతున్నా, టాప్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన సెమి దాబా వరకు ఎక్కడా కూర్చోని ఉన్నా చుట్టూ ఉండే పరిసరాలను వీక్షించేలా ఏర్పాటు చేశారు. మాస్టర్ డైనింగ్ హాల్‌కు ఆనుకుని గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఇండోర్ పార్టీ జోన్ మరింత ఆకట్టుకుంటుంది. ఇంటి చుట్టూ ఏర్పాటు చేసిన గార్డెన్‌లో చిన్నారులు సరదాగా గడిపే విడిది కేంద్రంలా ఉంటుంది.



### ఆర్కిటెక్చర్ నైపుణ్యానికి ఇదొక మచ్చుతునక..

ఇంటి యజమాని భావాలను అర్థం చేసుకుని, ఆయన అవసరాలకు అనుగుణంగా ఇంటిని డిజైన్ చేయడంలోనే చక్కని హరివిల్లుకు పునాది పడినట్లుగా ఈ నిర్మాణం ఉంటుంది. ఉమ్మడి నల్గొండకు చెందిన ఆర్కిటెక్ట్ రవి కుంభం పదికాలాల అనుభవాన్ని రంగరించి ఇంటిని తీర్చిదిద్దారు. మెట్టు నుంచి మొదలుకుని, వాల్ డిజైనింగ్ వరకు, ఇంటి ప్రాంగణంలో కనిపించే ప్రతి ఇంటీరియర్ ప్రొడక్ట్ కూడా ఇంటి అందాన్ని మరింత పెంచుతుంది. ఇళ్లంటే సిమెంట్, ఇసుక, నాలుగు ఇటుకలు కలిపి కట్టేది కాదనీ, జీవం పోసుకున్న ఆహ్లాదభరితమైన నిలయానికి నిదర్శనంలా, ఆర్కిటెక్చర్ సూక్ష్మమైన నైపుణ్యానికి మచ్చుతునకలా, నిర్మాణ రంగంలో ప్రతాపరెడ్డికి ఉన్న మూడు దశాబ్దాల అనుభవాలను రంగరించి అందంగా పొదిగిన కళాత్మక సౌధంగా నిలుస్తోంది.



### ఏకో ఫ్రెండ్లీ డిజైనింగ్....

ఇంటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంప్‌లో ఏకంగా రెండు లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసుకునేలా నిర్మించారు. ఇంటి దాబాపై పడిన వర్షపు నీరు నేరుగా ఈ సంపులోకి వచ్చేలా డిజైన్ చేశారు. దీని ద్వారా ఇంటి అవసరాలకు సరిపడా మంచినీరు లభ్యం అవుతుంది. అదేవిధంగా గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్రతి రూంలో ఏర్పాటు చేసిన పారదర్శకమైన గోడలు, వెంటిలేటెడ్ రూఫ్ టాప్‌తో పుష్కళమైన సహజ కాంతి ప్రసరిస్తుంది. ఇక ఇంటి చుట్టూ ఏర్పాటు చేసిన గార్డెన్ నుంచే వీచే పిల్లగాలి కూడా నేరుగా ఇంట్లోకి ప్రసరించినట్లుగా ఇంటి ఆవరణం ఉంటుంది. ఆరుబయట వాతావరణానికి అనుగుణంగా తక్కువ ఉష్ణోగ్రతలతో చల్లని పొదరిల్లును మరిపిస్తోంది. దాదాపు 1960 చదరపు గజాల విస్తీర్ణంలో 15వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన విలాసవంతమైన భవనం బీటీఆర్ మాక్ విల్లా గేటెడ్ కమ్యూనిటీలో ప్రత్యేకమైన నిర్మాణంగా నిలుస్తోంది.






# వేడుకలన్నింటికి సరైన వేదిక... జేబీ ఇన్‌ఫ్రా అరణ్య

## తుక్కుగూడ సమీపంలో అతిపెద్ద కన్వెన్షన్, రీసార్ట్

### అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ జేబీ ఇన్‌ఫ్రా గ్రూప్

### పది ఎకరాల విస్తీర్ణంలో ఏకో ఫ్రెండ్లీ రీసార్ట్, భారీ కన్వెన్షన్ హాల్స్

“ డెస్టినేషన్ ఈవెంట్ల ట్రెండ్ మొదలైంది. ఒకప్పటి లాగా ఇంటి వద్ద కార్యక్రమాలను నిర్వహించుకోవడం కష్టంగా మారింది. స్థలాభావం కారణం వచ్చిన అతిథులకు సౌకర్యాలు, సదుపాయాలను సమకూర్చుకోవడం ఇబ్బందిగా మారింది. అలాంటి సమస్యలకు చెక్ పెడుతూ... వేడుకకు వచ్చే అతిథ్యమిచ్చేలా వినూత్నంగా, విశాలమైన ప్రాంగణంలో ప్రముఖ డెవలపర్ జేబీ ఇన్‌ఫ్రా గ్రూప్ కన్వెన్షన్ అండ్ రీసార్ట్‌ను నిర్మించింది. అన్ని వర్గాలకు అనువుగా ఉండే విధంగా, ఆపర్డబుల్ ధరలతో లగ్జరీ కన్వెన్షన్ హాల్‌తో అతిథ్య రంగంలో మరో అడుగు ముందుకేసింది. మూడు దశాబ్దాల కాలంగా హైదరాబాద్ సిటీ శివారుల్లో వందలాది ఎకరాల విస్తీర్ణంలో ఓపెన్ ప్లాట్లను ఆ సంస్థ నిర్మించిన అనుభవం, కొనుగోలుదారుల అభిరుచి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఏకో ఫ్రెండ్లీ రిసార్ట్‌తోపాటు మెగా కన్వెన్షన్ హాల్‌ను సకల సదుపాయాలతో ఏర్పాటు చేసింది. అవుటర్ రింగు రోడ్డుకు సమీపంలో తుక్కుగూడ జంక్షన్ నుంచి ఐదు నిమిషాల దూరంలోనే శ్రీశైలం హైవే మార్గంలో పది ఎకరాల విస్తీర్ణంలో కన్వెన్షన్, మినీ లాన్, మియావాకీ థీమ్ ఫారెస్ట్ పూల్ సైడ్ రీసార్ట్, సౌకర్యవంతమైన కాటేజ్‌లతో జేబీ ఇన్‌ఫ్రా గ్రూప్ చేపట్టిన అరణ్య కన్వెన్షన్ అండ్ రీసార్ట్స్ విశేషాలతో ఈ వారం విశాలభారతి రియల్ టాక్.



### వైభవోపేతమైన వేడుకలకు సరిపోయేలా...

గడిచిన ఐదారేళ్లుగా వేడుకలను వైభవోపేతమైన నిర్వహించడం అనివార్యంగా మారింది. బంధువులందరినీ వేరే రాష్ట్రాలు, ప్రాంతాలకు తీసుకెళ్లడం ఖర్చుల భారాన్ని పెంచుతుంది. అలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఒకేచోట అన్ని కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అరణ్య కన్వెన్షన్ అండ్ రీసార్ట్స్ ఎంతగానో సహకరిస్తోంది. ప్రస్తుతం పది ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన భారీ కన్వెన్షన్ హాల్ అన్ని సదుపాయాలు ఉంటాయి. ఒకసారి ఈ ప్రాంగణంలోకి అడుగుపెడితే... అన్ని కార్యక్రమాలను ఒకే చోట నిర్వహించుకోవచ్చు. హైదరాబాద్ కేంద్రంగా ఏటా వందలాది డెస్టినేషన్ ఈవెంట్లు జరుగుతున్నాయి. ఎంతో మంది వ్యయప్రయాసాలకు తట్టుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లి మరీ వేడుకలను చేసుకుంటున్నారు. కానీ అలాంటి వేదికలతో కొన్ని సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. అందుకే హోం సిటీలోనే అందరికీ వీలుగా ఉండేలా కార్యక్రమాలను సంతోషంగా నిర్వహించుకోవచ్చు. ఇక ఓఆర్ఆర్ వెంబడి అరణ్య కన్వెన్షన్ హాల్స్ నిర్మించడం వలన నగరంలో ఏ మూలాన ఉన్న ఓఆర్ఆర్ మీదుగా రాకపోకలు చేసుకోవచ్చు. నగరంలో తలెత్తే ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు వేడుకలు చేసుకునే వారికి అదనపు తలనొప్పిగా మారుతున్నాయి. ఇలాంటి సమస్యలకు తావు లేకుండా ఉండేందుకు జేబీ ఇన్‌ఫ్రా గ్రూప్ ద్వారా అతిపెద్ద కన్వెన్షన్ అండ్ రీసార్ట్ ప్రాంగణమే జేబీ గ్రూప్ అరణ్య.


అనిల్ రెడ్డి, జేబీ ఇన్‌ఫ్రా గ్రూప్ మేనేజింగ్ పార్టనర్

**విశాలభారతి, హైదరాబాద్ :**

ఓపెన్ ప్లాటింగ్ దశాబ్ధాల అనుభవం తర్వాత హైదరాబాద్ కేంద్రంగా రిసార్ట్ అండ్ హాస్పిటాలిటీ రంగంలో ప్రముఖ డెవలపర్ సంస్థ జేబీ ఇన్‌ఫ్రా మరో అడుగుకు ముందుకేసింది. హైదరాబాద్ చుట్టూరా విస్తరించి ఉన్న అవుటర్ రింగు రోడ్డుకు ఆనుకుని భారీ కన్వెన్షన్ అండ్ రిసార్ట్‌ను నిర్మించింది. జేబీ అరణ్య బ్రాండింగ్‌తో కార్యాకలాపాలు నిర్వహిస్తుంది. ప్రస్తుతం హైదరాబాద్ డెస్టినేషన్ మ్యారేజ్, ఈవెంట్లకు వేదికగా మారుతుంది. ఈ క్రమంలో ఓఆర్ఆర్ వెంబడి పదుల సంఖ్యలో కన్వెన్షన్ వెంచర్లు అందుబాటులోకి వచ్చాయి. అయితే అందరికీ భిన్నంగా, వైవిధ్యమైన, సువిశాలమైన ప్రాంగణంలో భారీ కన్వెన్షన్ హాల్‌ను పది ఎకరాల విస్తీర్ణంలో చేపట్టింది. ఇందులో మెయిన్ ఫంక్షన్ హాల్‌తో పాటు, కాటేజ్ థీమ్ రిసార్ట్, జపనీస్ ఫారెస్ట్ టెక్నాలజీతో పూల్ సైడ్ రిసార్ట్, మరో మూడు మినీ ఓపెన్ కన్వెన్షన్ హాళ్లను నిర్మించింది. అదేవిధంగా నగరం పెరిగిన ట్రాఫిక్ రద్దీ, తక్కువ స్థలం కారణంగా భారీ స్థాయిలో పెళ్లి వేడుకులను నిర్వహించుకోవడం కొంచెం కష్టతరం అవుతుంది. ఇలాంటి సందర్భంలో అట్టహాసంగా వేడుకలను నిర్వహించుకునేందుకు వీలుగా, కంపౌండ్‌లో ఎకరన్నరకు పైగా పార్కింగ్ స్థలంతో, మరో మూడు ఎకరాల భారీ పార్కింగ్ పార్శిల్‌ను కలిగి ఉంది. ఒక మెగా ఈవెంట్, రెండు మిడ్ రేంజ్ కార్యక్రమాలను ఈజీగా చేసుకునే విధంగా, వచ్చిపోయే అతిథులకు ఉండేందుకు వీలుగా 24 కాటేజ్‌లు, నాలుగు పూల్ సైడ్ రిసార్ట్ హోంలతో అందంగా తీర్చిదిద్దింది.

### సువిశాలమైన వేదికపై వేడుక..

వేడుక ఏదైనా.... వేదిక తమదేన్నట్లుగా, అతిథులు వచ్చిపోయేందుకు అనువుగా ఉండేలా అవుటర్



రింగు రోడ్డు సమీపంలోని తుక్కుగూడ జంక్షన్‌కు చేరువగా నిర్మించింది. ట్రాఫిక్ సమస్యలు, రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా భారీ కన్వెన్షన్ హాల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దింది. 10వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే మెయిన్ కన్వెన్షన్ హాల్‌ను 700 నుండి 800 మంది సీటింగ్ కెపాసిటీతో చేపట్టింది. అదేవిధంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అతిథుల కోసం ప్రత్యేకంగా ఉండేలా సింగిల్ బెడ్రూం, అటాచ్డ్ బాత్రూంతో 24 కాటేజ్‌లను నిర్మించింది. ఇక వేడుకకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలంతోపాటు, కార్యక్రమానికి తగినట్లుగా ఓపెన్ లాన్ పార్టీ లాంజ్‌లను నిర్మించింది. అదేవిధంగా ప్రైవసీ కోరుకునేవారికి వీలుగా మియావాకీ థీమ్‌తో 20వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే పూల్ సైడ్ రీసార్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. స్విమ్మింగ్ పూల్, వాష్ రూంతోపాటు, ముగ్గురు సౌకర్యవంతంగా ఉండేందుకు వీలుగా నిర్మించిన పూల్ సైడ్ కాటేజ్‌లు అదేవిధంగా 37వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే మెగా పార్టీ లాన్, చిరు వేడుకలను అనువుగా ఉండేలా 8వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మరో మినీ పార్టీ లాన్‌తో అరణ్య కన్వెన్షన్ అండ్ రీసార్ట్‌ను అందంగా తీర్చిదిద్దింది.

### డెస్టినేషన్ ఈవెంట్లకు అనువుగా...

ఒకప్పటిలాగా ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాలు చేసుకునే సంప్రదాయానికి స్వస్తి పలుకుతూ... పది కాలాలు గుర్తుండిపోయేలా డెస్టినేషన్ ఈవెంట్ల హవా కొనసాగుతుంది. బంధువులు, సన్నిహితులందరిని ఒకేచోటకు తీసుకువచ్చి సకల సదుపాయాలు కన్వెన్షన్ హాల్స్, రీసార్ట్‌లో కార్యక్రమాలను చేసుకోవడం సర్వసాధారణంగా మారింది. ప్రస్తుతం ఈ తరహా ట్రెండ్ హైదరాబాద్‌లో మరింత వేగంగా పుంజుకున్నది. అయితే లక్షలాది రూపాయలు ఖర్చు, హంగు ఆర్భాటాలతో వేదికలను తీర్చిదిద్దినా... వచ్చే అతిథులకు అనుగుణంగా విశాలమైన సభా ప్రాంగణాలు కరువైయ్యాయి. దీంతో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలతోపాటు, కిక్కిరిపోయే ఫంక్షన్ హాల్‌లో ఇరుకైపోతుంది. అందుకే అతిథుల సంఖ్యకు అనుగుణంగా సువిశాలమైన ప్రాంగణంలో అన్ని సౌకర్యాలతో డెస్టినేషన్ ఈవెంట్లకు వీలుగా ఉండే కన్వెన్షన్ హాల్స్, రీసార్టులకు క్రమంగా ఆదరణ పెరుగుతున్నది. ఎలాంటి వేడుక అయినా... వచ్చే అతిథులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేలా అన్ని వసతులు ఉండే కన్వెన్షన్ హాళ్లకు డిమాండ్ వస్తోంది.

### ఒకే వేదికపై అన్ని కార్యక్రమాలు...

ఉదాహరణకు పెళ్లి వేడుకను తీసుకుంటే.. పెళ్లి కూతురు, పెళ్లి కొడుకు బంధువులతో కలిసి తక్కువ తక్కువ 500 మంది వరకు హాజరవుతున్నారు. వీరంతా కలిసి ఉండేందుకు చిన్నగా ఫంక్షన్ హాళ్లు సరిపోవు. కనీసం పెళ్లి కూతురు, పెళ్లి కొడుక్కి కూడా వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉంటుంది. పెళ్లి అంటే అతిథులు, వేడుకలు, ఆహారం, వసతి, రవాణా, డెకరేషన్, లైటింగ్ అనే అంశాలు అత్యంత కీలకమైనవి. వీటన్నింటిని అనువుగా ఉండాలంటే సువిశాలమైన ప్రాంగణాలతోనే ఒకే వేదికగా ఉండే కన్వెన్షన్ హాల్స్‌తోనే సాధ్యం అవుతుంది. ఒకసారి పెళ్లి సామాగ్రి, బంధువులతో కలిసి ఈ కన్వెన్షన్ హాల్‌లో అడుగుపెడితే ఎలాంటి అసౌకర్యాలకు తావు లేకుండా కార్యక్రమాలను ఇరు వైపులా కుటుంబాలు సంతోషంగా జరుపుకోవచ్చు. గోవా, పుణే, కొడైకెనల్, ఊటీ, కేరళ వంటి ప్రాంతాలు దక్షిణాదిలో డెస్టినేషన్ ఈవెంట్లకు అనువుగా ఎప్పటి నుంచి అందుబాటులో ఉన్నాయి. అయితే ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు వేడకులకు ప్రతికూలంగా మారుతున్నాయి. అలాంటి ఇబ్బందులే లేకుండా కుటుంబ సభ్యుల నడుము అంగరంగ వైభవంగా కార్యక్రమాలను ఎలాంటి డిస్టర్బెన్స్ లేకుండా నిర్వహించుకోవచ్చు. జేబీ ఇన్‌ఫ్రా గ్రూప్ ఆధ్వర్యంలో చేపట్టి ఈ కన్వెన్షన్ అండ్ రీసార్ట్ రానున్న రోజుల్లో డెస్టినేషన్ ఈవెంట్లకు ప్రధాన కేంద్రంగా మారనుంది. ఈ వేదిక ద్వారా పెళ్లిలో జరిగే అన్ని కార్యక్రమాలను కూడా సువిశాలమైన ప్రాంగణంలో జరుపుకొనే వీలు ఉంటుంది.









# "డాక్టరేట్" తో సత్కారం

- విశిష్ట సేవలు అందించినందుకు డాక్టరేట్ ప్రదానం
- తమిళనాడు ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్న "రాజు నాయక్"



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**
యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామానికి అనుసంధానమైన బొల్లిగుట్ట తండాకు చెందిన మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజు నాయక్ డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. తమిళనాడు ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పురస్కారం ప్రదానం అందించారు. ఎలాంటి ఆపద వచ్చిన,ఆపద ఉందని తెలిసినా తను అండగా ఉన్నానంటూ ముందుకు వచ్చి తనవంతు ఆర్థిక సాయం అందించే గొప్ప మనసుకు డాక్టరేట్ పట్టా రావడం ఒక నిదర్శనం. నిరుపేదల కుటుంబంలో పుట్టి రాజకీయ ప్రస్థానం లో సర్పంచిగా మొదలై ఎంపీటీసీ గెలిచి ఎంపీపీగా యాచారంలో తన ప్రత్యేక స్థానం సంపాదించాడు. రాజకీయంతోపాటు సేవా రంగంలో కూడా తన ఉనికి చాటాడు. వైద్య శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు, రక్తదానం తోపాటు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆపదలో ఉన్న వ్యక్తికి, అండగా ఉంటూ, తనదైన శైలిలో ప్రజా నాయకునిగా ముద్ర వేసుకున్నారు, ప్రేమే మార్గం సేవే లక్ష్యంగా పనిచేస్తున్నారు.కొన్ని సందర్భాల్లో ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా సేవా కార్యక్రమాలు మాత్రం ఎక్కడ ఆపలేదు. డాక్టర్ రాజు నాయక్ మాట్లాడుతూ.. ఎవరికి ఆపద వచ్చినా తన మాతృమూర్తి ఫౌండేషన్ స్థాపించి ప్రాంతాలతో సంబంధం లేకుండా మరిన్ని సేవా కార్యక్రమాలు తనకు సాధ్యమైనంతవరకు నా వంతుగా సహాయం చేస్తానని తెలిపారు. డాక్టరేట్ రావడంతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. డాక్టరేట్ పట్టా సాధించినందుకు రాజనాయక్ కు మాజీ ఎమ్మెల్యేలతో పాటు రాజకీయ నాయకులు, శ్రేయోభిలాషులు, ప్రజలు అభినందించారు.

## న్యాయవాద పట్టా పొందిన ప్రణీత్ కుమార్

**పాలకీడు, విశాలభారతి:**
శూన్య పహాడ్ గ్రామానికి చెందిన చెన్నూరి ప్రణీత్ కుమార్. వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుండి ఎల్.ఎల్.బి పూర్తిచేసుకుని శనివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు లో ప్రమాణ స్వీకారం ద్వారా న్యాయవాద పట్టాను పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగిన తాను సామాన్యులకు న్యాయం జరిగేలా అందుబాటులో ఉండి న్యాయ సేవ చేస్తానని తెలిపారు. న్యాయవాదిగా పట్టా పొందిన ప్రణీత్ కుమార్ ను గ్రామానికి పలువురు పెద్దలు అభినందించారు.



# జాతీయ రహదారులపై సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి

- మున్సిపాల్టీ లలో రోడ్ల ప్యాచ్ పనులు పూర్తి చేయాలి
- జాతీయ రహదారుల పై బ్లాక్ స్పాట్ లు గుర్తించాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, విశాల భారతి**
జిల్లాలోని అన్ని జాతీయ రహదారుల పై సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, మున్సిపాల్టీ లలో రోడ్ల ప్యాచ్ పనులు పూర్తి చేయాలని, జాతీయ రహదారుల పై బ్లాక్ స్పాట్ లు గుర్తించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం వెబెక్స్, వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా రోడ్ల భద్రత పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గత నెలలో జరిగిన సమావేశంలో జిల్లాలోని అన్ని జాతీయ రహదారులపై గుర్తించిన బ్లాక్ స్పాట్స్ పై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ డి ఓ సూర్యాపేట వేణు మాధవ్ మాట్లాడుతూ పిల్లలమర్రి నుండి ఈనాడు అఫిస్ వరకు బ్లాక్ స్పాట్స్ గుర్తించటం జరిగిందని అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రమాదాలు అధికంగా జరిగే 22 లొకేషన్స్ లో సైన్ బోర్డ్ లు, డంబెల్ స్ట్రిక్స్ ఏర్పాటు చేయవలసి ఉంది కానీ 4 లొకేషన్స్ లలో మాత్రమే ఏర్పాటు చేశారని, మిగిలిన లొకేషన్స్ లలో త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఖమ్మం బైపాస్ సర్వీస్ రోడ్లలో స్పీడ్ బ్రేకర్స్, ర్యాంప్ లు ఏర్పాటు చేయాలని ఖమ్మం జాతీయ రహదారి అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నుండి సూర్యాపేట ఎన్ హెచ్ 365 పై అన్ని భద్రత చర్యలు ఒక నెల రోజులలో పూర్తి చేస్తామని డి ఈ రాహుల్ తెలిపారు. అన్ని జాతీయ రహదారులపై తీసుకున్న భద్రత చర్యలకి సంబందించిన వివరములను సమర్పించాలని సూచించారు. జనగాం క్రాస్ రోడ్డులో జరుగుతున్న పనుల వల్ల ప్రజలకి ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ డైవర్శన్ చేయాలని సూచించారు. కోదాడ జాతీయ రహదారి ఎన్ హెచ్ 67 వద్ద గల అప్రోచ్ రోడ్డు మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకి సూచించారు. కోదాడ మిర్యాలగూడ రోడ్డులో గోవిందాపురం వద్ద అలాగె మరకొన్ని మలుపుల వద్ద సైన్ బోర్డులు, లైటింగ్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న అంతర్గత రోడ్ల మరమ్మతుల పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని అలాగే మున్సిపల్ కమిషనర్ ల పరిధిలో గల రోడ్ల మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. చేపట్టిన పనులపై నివేదిక అందజేయాలనీ కలెక్టర్ ఈ ఈ ఆర్ & బి సీతరామయ్య కు సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బీ ,ఎన్ ఎచ్ ఐ ,ఎన్ హెచ్ అధికారులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ సిబ్బంది

# డిమాండ్లు పరిష్కరించాలి

- గూడూరు లక్ష్మీ నరసింహ్మా రెడ్డి

**ఆమనగల్లు, విశాలభారతి :**
అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా , అమలుకు సాధ్యం కానీ అనేక హామీలతో ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ప్రజానీకాన్ని, ఉద్యోగస్తులను మోసం చేసిందని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నరసింహ్మా రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక ఉపాధి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల నిరసన సమ్మెకు మద్దతు తెలిపి, గ్రామపంచాయతీ సిబ్బంది డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది డిమాండ్ చేస్తున్న 18,500 కనీస వేతనము ఇస్తూ పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సిబ్బంది ప్రతి ఒక్కరికి 5,00,000 రూపాయల వైద్య భీమా కల్పించాలని, ప్రతినెల సరైన సమయంలో జీతాలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ లోపించిందని, ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ సిబ్బందితో చర్చలు జరిపి వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించి గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పనులు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మంగళ్ పల్లి నరసింహ, బీఆర్ఎస్ యూత్ వింగ్ పట్టణ అధ్యక్షుడు కొ ప్పు కృష్ణ, వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మాధవులు, మాజీ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు క్యామ వెంకటేష్, రాయికంటి సురేష్, సిద్ధి గారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఫ్యాన్ల అందజేత

**ఆమనగల్లు, విశాల భారతి :**
తలకొండపల్లి మండల పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మల్టిపుల్ ఎల్సిఐఎఫ్ ఏరియా లీడర్ లయన్ సందడి నరేందర్ రెడ్డి సమకూర్చిన రూ .25వేల విలువగల పది ఫ్యాన్ లను ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కండే ఓంకారం అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని విద్యార్థులకు, పాఠశాలలకు మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో లయన్స్ క్లబ్ ఆమనగల్లు ఎప్పుడు ముందంజలో ఉంటుందన్నారు. గతంలో లయన్స్ క్లబ్ సభ్యులు మోహన్ రెడ్డి ఈ పాఠశాలకు రూ .50,000 విరాళం అందజేసినట్లు ఆయన తెలిపారు. లైన్స్ క్లబ్ ఆమనగల్ వారి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో పాఠశాలకు వాటర్ ట్యాంకులు, బెంచీలు, అందజేసినట్లు జిల్లా చైర్మన్ కండె ఓంకారం తెలిపారు. ఉన్నత పాఠశాలకు 10 ఫ్యాన్స్ అందజేసినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు డి. మోహన్ రెడ్డి, పండగ అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, క్లబ్ పిఆర్వో పాషా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ లక్ష్మి, ఉపాధ్యాయులు క్రాంతి కుమార్, రాజేశ్వర్ రెడ్డి, కబీర్, పాండు, కృష్ణ, సుష్మ పాల్గొన్నారు.



## ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా

# సమగ్ర శిక్షా ఉద్యోగుల భిక్షాటన

**ఆర్మూర్, విశాల భారతి**
తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో 22వ రోజు సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు నిజామాబాద్ లోని ఎన్టీర్ చౌరస్తా సిగ్నల్స్ వద్ద నుండి కోర్టు చౌరస్తా వరకు ప్రభుత్వ మొండి వైకరికి నిరసనగా భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వీధులలో షాపులలో పాదాచారులకు బిక్షం అడిగి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కొరకై చేస్తున్న నిరవధిక సమ్మెను ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే రాజు భూపేందర్లు పేర్కొన్నారు. పదిహేను ఇరవై సంవత్సరాల నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు అతి తక్కువ వేతనాలతో క్రమశిక్షణతో పని చేస్తున్న కనీస వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందో తెలియజేయాలని ఈ వివక్షకు కారణం తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని రానున్న రోజుల్లో తమ ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కోశాధికారి ప్రసాద్ మహిళా అధ్యక్షురాలు గంగామణి, సుప్రజా, రాజు, విద్యాసాగర్, పవిత్రన్, అప్సర్, సంతోష్, గిరీష్, రమేష్ , మోహన్, జలంధర్, రాజమణి, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




# వరంగల్ జిల్లాలో డబ్ల్యూజేఐ ఆవిర్భావం

**వరంగల్, విశాలభారతి:**
భారతీయ మజ్దూర్ సంఘ్ కు అనుబంధంగా ఏర్పడి పాత్రికేయుల సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో కృషి చేస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) వరంగల్ జిల్లాలో ఆవిర్భవించింది. . స్థానిక బాల సముద్రంలో శనివారం జరిగిన సన్నాహక సమావేశానికి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరి కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య రామయ్యలు ఈ సమావేశంలో ప్రసంగించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ఇతర యూనియన్లు విఫలమయ్యాయని వారు ఆరోపించారు. అరవయ్యేళ్లుగా జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటున్న సంఘాల వైఫల్యమే నేటి పాత్రికేయుల దుస్థితికి కారణమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో నిఖార్సయిన సంఘంగా డబ్ల్యూజేఐ జాతీయ స్థాయిలో ఆవిర్భవించిందని పేర్కొన్నారు. 17 రాష్ట్రాలలో కార్యకలాపాలు నిర్వర్తిస్తూ పాత్రికేయుల సమస్యలపై పోరాడుతోందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే విలేకరులకు ఏ ఆపద వచ్చినా డబ్ల్యూజేఐ అండగా ఉంటుందని తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పనిచేసే డబ్ల్యూజేఐలో వరంగల్ జిల్లా జర్నలిస్టులు పెద్ద ఎత్తున చేరాలని కోరారు. కొద్ది రోజుల్లోనే తెలంగాణలో తాము అతి పెద్ద జర్నలిస్టు సంఘంగా ఆవిర్భవించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

**పాత్రికేయులకు పురస్కారాలు**

పాత్రికేయులను ప్రోత్సహించేందుకు జనవరిలో రాష్ట్ర స్థాయిలో పురస్కారాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జనవరి పదో తేదీలోగా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సందర్భంగా పురస్కారాలకు సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు.



# జెండర్ మనసుకు సంబంధించినది

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి

**ఎల్బీనగర్ విశాలభారతి:**
ఆడ,మగ అనేవి భౌతిక పరమైన అంశాలు కావని, జెండర్ అనేది మనసుకు సంబంధించినదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి అన్నారు. ట్రాన్స్ జెండర్ల సమస్యలు హక్కులు అనే అంశంపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష ఇప్పటివరకూ మహిళలపైనే కొనసాగిందని, ఇప్పుడూ ట్రాన్స్ జెండర్లు కూడా ఈ జాబితాలో చేరిపోయారన్నారు. వివక్షను చట్టాలెప్పుడూ సమర్థించవన్నారు. ట్రాన్స్ జెండర్ల హక్కుల పరిరక్షణకు ట్రాన్స్ జెండర్ ప్రొటెక్షన్ యాక్టు ఏర్పాటయిందన్నారు.అనంతరం మెట్రొపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభి రామారావు ట్రాన్స్ జెండర్ ప్రొటెక్షన్ యాక్టు వివరించారు. అనంతరం క్యూ టీ సెంటర్ నిర్వాహకులు ఆదిత్య మాట్లాడుతూ జెండర్ అనేది క్రోమోజోములు, హార్మోనల్ ఇంబాల్యన్స్ కి కూడా సంబంధించినది కాదన్నారు. రచన, వైజయంతి మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లకు కర్ణాటక లో మాదిరిగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ప్రత్యేక హౌసింగ్ కాలనీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పొన్న శ్రీదేవి,అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



# మాజీ మంత్రిని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**సూర్యాపేట, విశాల భారతి**
టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డిని 11వ వార్డుకు చెందిన రాయిని గూడెం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో ఆయనతో పాటు, ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డితో కూడా కలిసి కొద్దిసేపు మాట్లాడారు. వారిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎలగబోయిన మధు యాదవ్, ఎలుగూరి వెంకటేశం, వీరయ్య గౌడ్, నంద్యాల ప్రతాపరెడ్డి, నంద్యాల శ్రీనివాస్ రెడ్డి ,బిక్షం రెడ్డి, జంగిలి సైదులు, కొప్పుల రామ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి ,ఉపేందర్ యాదవ్ ,సింగం నరేష్ ,మండలి సంజయ్ యాదవ్ ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
29.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily






# దేశం గొప్ప నేతను కోల్పోయింది

- డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్ రావు
- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు నివాళులు

**పటాన్ చెరు, విశాలభారతి**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ నేతలు సంతాపం తెలిపారు. తెల్లాపూర్ మునిసిపాలిటీ సర్కిల్ వద్ద మునిసిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ ఆర్థిక వేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్ రావు మాట్లాడుతూ మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఆయన మృతి దేశానికి తీరని లోటని చెప్పారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భరత్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ గౌడ్, మైనార్టీ జిల్లా కన్వనర్ వాజీద్, మునిసిపాలిటీ మైనార్టీ అధ్యక్షులు అక్రం, మండల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సాయినాథ్ రెడ్డి, నవారి శ్రీనివాస్ రెడ్డి, నావరి సాయినాథ్ రెడ్డి, తూర్పు శ్రీనివాస్, దరని రాజు, జావేద్, భాస్కర్ రెడ్డి, మంగలి మహేష్, మంగలి ప్రశాంత్, లడ్డు శ్రీనివాస్ రెడ్డి, కోటే రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కన్నీటి వీడ్కోలు






- ఏడాది పాలనలో కాంగ్రెస్ చేసిందేమీలేదు'
- ఫార్మా భూములపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలి'
- ఎర్రజెండా పోరాటంతోనే లగచర్ల రైతులకు న్యాయం '

# 'జమిలి ఎన్నికలు దేశానికి ప్రమాదకరం'

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

జమిలి ఎన్నికలు దేశానికి ప్రమాదకరమని, కేంద్రంలో బీజేపీ కేంద్రీకృత పాలన విధానం అమలు చేయాలన్నదే జమిలి ఎన్నికల ఉద్దేశమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. సీపీఐ (ఎం) రంగారెడ్డి జిల్లా 10వ మహాసభల సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల యాదయ్య అధ్యతన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బీజేపీ అమలు చేయాలనుకుంటున్న జమిలి ఎన్నికల విధానంపై పోరాటం చేసేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన హోంమంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానంతో రాష్ట్రాల హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. ఆదానీ విధానాలను రాహుల్ వ్యతిరేకిస్తున్నా... ఆయన శిష్యుడు రేవంత్ మాత్రం ఆదానీతో దోస్తీ కట్టాడని విమర్శించారు. సోలార్ ప్లాంట్స్ విద్యుత్ ఒప్పందాల విషయంలో ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ భూముల విషయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ తుంగలో తొక్కిందని తమ్మినేని మండిపడ్డారు. ఫార్మా భూములను రైతులకు ఎందుకు తిరిగి ఇవ్వడంలేదని ఆయన ప్రశ్నించారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మా కంపెనీలు పెట్టేందుకు 3వేల ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం యత్నించిందని, రైతుల తిరుగుబాటుతో వెనక్కి తగ్గారని అన్నారు. సీపీఎం పోరాటం వల్లే లగచర్ల రైతులకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఈ భూమల విషయానికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ , డీజీ నర్సింహరావు, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, సీనియర్ నాయకులు పి. జంగారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామేల్, మధుసూదన్ రెడ్డి, జగదీష్, శోభన్, రాజు, చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్, సీహెచ్ జంగయ్య, కె.జగన్, నర్సిరెడ్డి, అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్యాంసుందర్, మల్లేష్, ఇబ్రహీంపట్నం, బుగ్గరాములు, జంగయ్య, ఏర్పుల నర్సింహ, ఎల్లేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.








# లా పట్టా అందుకున్న మెట్టు శ్రీధర్

- విశ్వభారతి లా కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే

**పటాన్ చెరు,విశాలభారతి**



పటాన్ చెరు పట్టణానికి చెందిన మెట్టు శ్రీధర్ న్యాయ శాస్త్రంలో పట్టా అందుకున్నారు. న్యాయ శాస్త్రంలో డిగ్రీ పూర్తి చేసుకున్న మెట్టు శ్రీధర్ ఓయు పరిధిలోని ముత్తంగి విశ్వభారతి లా కాలేజీ నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ రవి అనంత చేతులమీదుగా న్యాయశాస్త్రపట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ చదువుకు వయసుతో సంబంధం లేదని, మనిషి జీవితంలో నిరంతరం విద్యార్థిగా కొత్త విషయాలు నేర్చుకోవాలని డా బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో తాను న్యాయ విద్యను అభ్యసించినట్టు తెలిపారు. భవిష్యత్తులో భారత రాజ్యాంగ ఫలాలు ప్రతీ ఒక్కరికి అందేవిధంగా సమాజంలో తనవంతు పాత్ర పోషిస్తానని, పేదలకు సమన్యాయం అందేవిధంగా తన కార్యాచరణ ఉంటుదని మెట్టుశ్రీధర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఓ.యు వి.సి ఎం కుమార్, ప్రొ. కాశీం, ప్రిన్సిపల్ భవాని, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఏడాది కేసుల వివరాలు వెల్లడించిన ఎస్పీ

**నల్లగొండ,విశాలాభారతి:**

గత ఏడాదితో పోలిస్తే నల్లగొండ జిల్లా క్రైం రేట్ గణనీయంగా పెరిగింది. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శనివారం పోలీస్ జిల్లా కార్యాలయంలో 2024 సంవత్సరంలో జరిగిన క్రైం, కేసుల వివరాలను వెల్లడించారు.2023 సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా 7901 కేసులు నమోదవ్వగా 2024లో 8695 ఎఫ్ఐఆర్ లు చేశారు. దీంతో గత ఏడాదికంటే ఈ ఏడాది 794 కేసులు పెరిగాయి.ఇందులో శాంతి భద్రతలు విఘాతం కలిగించే కేసుల్లో గత ఏడాది 523 ఉంటే ఈ ఏడాది 516కు తగ్గింది. 2024లో ఆస్తికోసం హత్యలు 5,బందిపోటు కేసులు 2, హత్యలు 33, ద్వేషపూరితంగా చంపిన కేసులు 5, లైంగికదాడులు 100, మోసాలు 657, హత్యాయత్నాలు 56, మిస్సింగ్ కేసులు 476 నమోదయ్యాయి.

# రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలిసిన టాస్క్ సిఓఓ

**ఆమనగల్లు, విశాల భారతి :**



1ఏం1బీ8th యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్ లో తెలంగాణ రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించి యునైటెడ్ నేషన్స్ న్యూయార్క్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు,ఐఐఈసి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ లతో మర్యాద పూర్వకంగా టాస్క్ సిఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాల కల్పనే ధ్యేయంగా కల్వకుర్తి పట్టణంలో తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోతున్న స్కిల్ సెంటర్ కు సంబంధించిన అంశాలతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన తదితర అంశాల గురించి చర్చించడం జరిగిందని రాఘవేందర్ రెడ్డి తెలిపారు.



# బ్రెయిన్ స్ట్రోక్ తో కాంగ్రెస్ నేత రాంపల్లి రవి మృతి

**తొర్రూరు, విశాలభారతి:**

తొర్రూరు కేంద్రంలోని 1వ వార్డుకు చెందిన కాంగ్రెస్ మండల నాయకుడు రాంపల్లి రవి బ్రెయిన్ స్ట్రోక్ తో హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు.పట్టణానికి చెందిన రవి గురువారం స్వగ్రామమైన ఏడునూతుల గ్రామానికి వెళ్లి వరి నాటు వేయించాడు. పనిచేస్తుండగానే అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ కు గురయ్యాడు. స్థానికులు గుర్తించి అతడిని హుటాహుటిన తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ కు తరలించగా హైదరాబాదుకు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు.అప్పటికే అపస్మారక స్థితికి చేరిన రవిని హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు రవి హర్ష ఆప్టికల్స్ నిర్వహించడంతోపాటు ప్రాథమిక వైద్యునిగా (ఆర్.ఎం.పి) మండల ప్రజలకు సేవలందిస్తున్నాడు. అందరితో కలివిడిగా,స్నేహ భావంతో మెలిగే రవి అకాల మృతిని స్థానికులు స్నేహితులు శ్రేయోభిలాషులు జీర్ణించుకోలేకపోయారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొనేవాడు.కాంగ్రెస్ పటిష్టతకు తన వంతు కృషి చేశాడు.కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ విభాగం ఉపాధ్యక్షుడిగా ఇప్పటివరకు పని చేశాడు.ఆయన భౌతిక కాయాన్ని కడసారి చూసేందుకు స్నేహితులు, అభిమానులు భారీగా తరలివచ్చి ఘన నివాళి అర్పించారు.



# ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నూతనకల్, విశాలభారతి:**

మండల కేంద్రములో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రావడానికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేసిందని,దేశ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కట్ట మల్లారెడ్డి, దరిపెల్లి వీరన్న, బాణాల సుదర్శన్ రెడ్డి, మల్లారెడ్డి యువజన కాంగ్రెస్ అద్యక్షులు పసుల అశోక్ యాదవ్ గ్రామ శాఖ అద్యక్షులు బొడ్డుపల్లి అంజయ్య సోషల్ మీడియా కోఆర్డీనేటర్ బొల్క సైదులు యాదవ్ సేవదళ్ మండల అద్యక్షులు నెల్లుట్ల మహేష్ మండల కాంగ్రెస్ నాయకులు ఉప్పుల పాపయ్య, చురకంటి చంద్రారెడ్డి, అబ్బాస్ అలీ, ఇమ్మారేడ్డి మహేష్‌రెడ్డి, ఏలేటి నారాయణ రెడ్డి,మడ్డి లింగయ్య గౌడ్, బంటు బద్రీ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మన్మోహన్ సింగ్ కు ఘన నివాళులు

**హైదరాబాద్,విశాలభారతి:**




తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా కార్యాలయములో ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కుమార్ తో కలిసి మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ మన్మోహన్ సింగ్ మరణంపై విచారం వ్యక్తం చేస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ భారత దేశం ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందంటే దానికి కారణం స్వర్గీయ మన్మోహన్ సింగ్ తొంభైవ దశకంలో వేసిన పునాదులని, అనుక్షణం దేశం కోసం పరితపించిన దేశభక్తుడని అన్నారు. మన్మోహన్ సింగ్ లాంటి మహామేధావి మరణం దేశాన్ని తీరని లోటని, అయన స్థానాన్ని భర్తీ చేయడం ఎవరివల్ల కాదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు కే ఆర్ రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు కుర్రాడి శ్రీనివాస్ సభ్యులు ఖాలెద్ అహ్మద్ పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
29.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# ప్రముఖుల విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

- ఎమ్మెల్యేకు వినతి

**ఆమనగల్లు, విశాల భారతి :**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి, మాజీ ముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాల ఏర్పాటుకు ఆమనగల్లులో స్థలం కేటాయించాలని శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తిచేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించిన వారిని స్మరించుకునేందుకు కోసం విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**క్రీడాకారుడిని సన్మానించిన ఎమ్మెల్యే:**

కల్వకుర్తి నియోజకవర్గంలోని నగరగడ్డ తండాకు చెందిన అర్జున్ మురళి ఆల్ ఇండియా నేషనల్ స్కూల్ గేమ్స్ అండర్ 14 కరాటే విభాగంలో రజిత పథకం సాధించారు. పథకం సాధించిన ఆయనను శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభినందించి సన్మానించారు. రాష్ట్రం తరపున పాల్గొని తొలిసారిగా పథకం సాధించడం అభినందనీయమని, రాష్ట్రం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ముసలమ్మ, కాడి చెరువులను తొందరగా నింపాలి

- ఎమ్మెల్యే వేముల

**బాల్కొండ, విశాల భారతి**

మోర్తాడ్ మండల కేంద్రంలోని ఎస్.సి వాడకు చెందిన రిశ్విత్ ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. ఇటీవలే బిక్నూర్ గురుకుల కాలేజ్ లో చదువుతున్న రిశ్విత్ ప్రమాదవశాత్తు కాలేజ్ బిల్డింగ్ పైనుండి పడి రెండు కాళ్ళు విరగడంతో వారిని మోర్తాడ్ లోని నివాసంలో ఎమ్మెల్యే వేముల పరామర్శించారు. అక్కడ నుండే కలెక్టర్,డిఎంహెచ్ఓతో మాట్లాడి అతనికి అందాల్సిన చికిత్స ను ప్రభుత్వమే దగ్గరుండి చూసుకోవాలని కోరారు. అనంతరం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

**మోర్తాడ్ ముసలమ్మ, కాడి చెరువులను నింపాలి:**

ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ లో పుష్కలంగా నీళ్లు ఉండటంతో చౌట్పల్లి హన్మంత్ రెడ్డి ద్వారా నీళ్లు నింపడానికి అవకాశం ఉన్నందున షెట్పల్లి పంప్ హౌజ్ తొందరగా ప్రారంభించాలని నీటి పారుదల శాఖ అధికారులను ఎమ్మెల్యే తెలిపారు. అక్కడ నుండి మోర్తాడ్ ముసలమ్మ చెరువులోకి నీళ్లు నింపుతూ సమాంతరంగా అక్కడ నుండి బషీరాబాద్ రైతుల విజ్ఞప్తి మేరకు ముసలమ్మ చెరువు పంపు హౌజ్ మోటార్లు స్టార్ట్ చేసి బషీరాబాద్ కాడి చెరువులోకి నీళ్లు నింపాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.




# ఘనంగా పీజేఆర్ 17వ వర్ధంతి

**కూకట్ పల్లి, విశాలభారతి:**

పీజేఆర్ 17వ వర్ధంతి కార్యక్రమాన్ని పీజేఆర్ ఫౌండేషన్ కూకట్పల్లి నియోజకవర్గం అధ్యక్షులు కర్క నాగరాజ్ ఆధ్వర్యంలో మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి బండి రమేష్,బీజేపీ రాష్ట్ర నాయకులు మాధవరం కాంతారావు విచ్చేసి పిజెఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికుల పక్షపతిగా, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ స్వపక్షం అయిన విపక్షం అయిన ప్రభుత్వాలతో అలుపెరుగనిపోరాటం చేసిన ప్రజానాయకుడు పి.జనార్ధనరెడ్డి అని వారు పేర్కొన్నారు.అసెంబ్లీలో తెలంగాణా ప్రాంతానికి సంబందించిన సమస్యలను సభ దృష్టికి తెచ్చిన గొప్ప నాయకులు పిజెఆర్ అని పార్టీలకు అతీతంగా పిజెఆర్ ని ఇష్టపడతారని హైదరాబాద్ మహానగరంలో వేలాది మంది పేద ప్రజలకు ప్రభుత్వం నుండి పట్టాలిపించిన ఘనత పిజెఆర్ దేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు సంబందించిన నాయకులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్,మాజీ కార్పొరేటర్ బాబురావు,తూము శ్రావణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్క పెంటయ్య,అంబటి శ్రీనివాస్, అంబేద్కర్ నగర్ బస్తీ మాజీ అధ్యక్షులు కర్క స్వామి,కర్క డాకయ్య,,జిల్లా గోపాల్, కర్క రవీందర్,భాశెట్టి నర్సింగరావు,కర్క శివశంకర్,తూము మనోజ్, సాధు ప్రతాప్ రెడ్డి,తూము వేణు,తూము వినయ్,తూము శైలేష్ కుమార్,నాగిరెడ్డి,సతీష్ రెడ్డి,రఘు,ఉప్పు రాము,సునీల్ యాదవ్,కర్క నిఖిల్,,జెల్ల రాము,కర్కనర్సింగ్ రావ్,వెంకన్న,అంజి గౌడ్, మల్లేష్,కర్కచిన్న సాయి,జి.రాజు, సదా మహేష్,శ్రీనివాస్,మమరియు పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు,పీజేఆర్ అభిమానులు పాల్గొన్నారు.

**కన్నీటి వీడ్కోలు**








# లక్షల మందిని ఆత్మజ్ఞానులుగా పత్రీజీ మార్చారు

- పత్రీజీ ధ్యాన మహాయాగం-3లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- మనకు శరీరంతో పాటు ఆత్మ కూడా ఉంది
- బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ కూతురు పరిణిత పత్రీ
- మహేశ్వర పిరమిడ్ అభివృద్ధిలో లక్ష్మణరావు ప్రాత గొప్పది
- పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి

**ఆమనగల్లు విశాల భారతి :**



బోధన్ షక్కర్ నగర్ లో పుట్టిన పత్రీజీ అందరిలో ఒకడిగా, మైత్రేయ బుద్ధుడిగా, సామాన్యుడిగా ఉంటూనే లక్షల మందికి ఆత్మ జ్ఞానాన్ని బోధించారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు కడ్తాల్ కైలాసపురిలో నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహాయాగంలో ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. యోగా, వేదపఠనం, సంగీత నాద ధ్యానం కార్యక్రమాలు ధ్యానులను విశేషంగా అలరించాయి. యోగా నిపుణులు వెంకటేశ్ యోగా ఆసనాలు, ప్రాణాయణం, ముద్రలు గురించి వివరించి ధ్యానులకు యోగా, ధ్యానంపై చక్కటి అవగాహన కల్పిస్తున్నారు. అలాగే చైతన్య, మాస్టర్ తేజాలు అద్భుతంగా వేదపఠనం చేసి ధ్యానులకు చక్కటి వేద జ్ఞానాన్ని అందిస్తున్నారు. మరోవైపు సంగీత నాద ధ్యానం కార్యక్రమం ధ్యానులను విశేషంగా అలరిస్తుంది. మనకు శరీరంతో పాటు ఆత్మ కూడా ఉందని ధ్యానం చేసి ప్రతి ఒక్కరు అనుభవపూర్వకంగా తెలుసుకోవాలని పత్రీజీ కూతురు పరిణత పత్రీ పేర్కొన్నారు. బ్రహ్మర్షి పత్రీజీ వీడియో సందేశాన్ని అందరికి అర్ధమయ్యే విధంగా వివరించారు. పత్రీజీ మధ్యే మార్గం గురించి అనునిత్యం సూచించారని, ఇంట్లోనే గురుకులం ఉండాలని, తల్లిదండ్రులే జ్ఞానవంతులు, సత్యం తెలిసినవారు. అయితే ఆ ఇళ్లు గురుకులంతో సమానమని తెలియజేసారని వివరించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ లక్ష్మణ్ రావు పాల్గొని తన సందేశాన్ని ఇచ్చారు. ఈ భూమి మీద ఇప్పటివరకు ఏ గురువు కూడా తాను గురువును కాదు అని చెప్పలేదని. ఒక బ్రహ్మర్షి పత్రీజీ మాత్రమే చెప్పారని గుర్తుచేసారు. అనంతరం పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ ఇంత అద్భుతంగా అభివృద్ధి చెందడంలో లక్ష్మణరావుది ముఖ్య ప్రాత వుందని కొనియాడారు. అనంతరం లక్ష్మణ్ రావును ఘనంగా సన్మానించారు. పిఎస్ఎస్ఎం నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, నెల్లూరు జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ జేజే.నారాయణ, అనంతపురం జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ రవిశంకర్, పీఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్, ప్రకాశం జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీల్ పాల్గొని తమ సందేశాలు ఇచ్చారు. తమ జిల్లాలో కొనసాగుతున్న ధ్యాన ప్రచారం గురించి, తాము చేస్తున్న కార్యక్రమాలు, చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే తమ ధ్యాన అనుభవాలను తెలియజేసారు. పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుల కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఆసిపాబాద్ జిల్లా, ములుగు జిల్లా, రంగారెడ్డి జిల్లా, సూర్యాపేట జిల్లాల పిరమిడ్ మాస్టర్లు రాజలింగ్, రఘుపతి, నర్సింగ్ రాజు, సిద్ధపూర్యప్రకాశ్ రావు, వెంకటేశ్వర్లు, పాల్గొని తమ సందేశాలను ఇచ్చారు. తమ జిల్లాలో కొనసాగుతున్న ధ్యాన, జ్ఞాన కార్యక్రమాల గురించి, భవిష్యత్తులో తాము చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి తెలియజేసారు. అనంతరం ఈ జిల్లాల పిరమిడ్ మాస్టర్లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ట్రూత్ ఫర్ యూత్ అనే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు, మోటివేషనల్ స్పీకర్లు పాల్గొని తమ సందేశాల ద్వారా యువతలో మంచి స్పూర్తిని కలిగిస్తున్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. యువకులు మూస పద్ధతిలో వెళుతున్నారని అన్నారు. ధ్యానం ద్వారా మనకు దేంట్లో టాలెంట్ ఉందో, ఎందులో ఇష్టం ఉందో తెలుస్తుందని తెలిపారు. అనంతరం సృజన వేణుగోపాల్ రెడ్డి తన ధ్యాన అనుభవాలను వివరించారు. అ తర్వాత మోటివేషనల్ స్పీకర్ వివేక్ చంద్ర, మ్యానిఫెస్టేషన్, ఆలోచనలు, కొత్త సంవత్సరంలో పెట్టుకోవాల్సిన లక్ష్యాల గురించి అద్భుతంగా వివరించి ధ్యానులు, యువకుల్లో చక్కని స్పూర్తిని నింపారు. సీనియర్ మాస్టర్స్, గ్లోబల్ మాస్టర్స్ పాల్గొని అద్భుతమైన సందేశాలను ఇస్తున్నారు. పిఎస్ఎస్ఎస్ఎ అకాడమీకి చెందిన శివరామప్ప పాల్గొని ప్రసంగించారు. బ్రహ్మర్షి పత్రీజీ చిన్న చిన్న మాటలతో అద్భుతమైన సందేశాన్ని అందించారని తెలిపారు. మనమంత దివ్యస్వరూపాలమని, ఆత్మ స్వరూపాలమని తెలియజేసారు. ఇప్పుడు మానవులకు కావాల్సింది భౌతిక సంపద కాదని ఆధ్యాత్మిక సంపద కావాలని సూచించారు. విద్యావ్యవస్థను సంస్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం పిఎస్ఎస్ఎస్ఎ అకాడమీ ద్వారా వెలుబడిన ఆధ్మాత్మిక పుస్తకాలను పరిణిత పత్రీ, శివరామప్పలు ఆవిష్కరించారు.



# హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా ఆరిఫ్ ఎంపిక

**బాల్కొండ, విశాల భారతి**

భీమ్‌గల్ పట్టణానికి చెందిన మహమ్మద్ ఆరీఫ్ కు హైదరాబాద్ కు చెందిన ఆలిండియా హ్యూమన్ రైట్స్(శైన్ ఫోండెషన్)సోషల్ అండ్,జస్టిస్ జిల్లా అధ్యక్షుడిగా ఆల్ ఇండియా ఉమెన్ రైట్స్ ప్రెసిడెంట్ షేక్ షాహిన్ మొహమ్మద్ ఆరిఫ్ ను జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ షాహిన్ మాట్లాడుతూ.. సమాజ సేవకు నీతి నిజాయితీ గొప్పతనం చూసి భీమ్‌గల్ పట్టణానికి చెందిన మహమ్మద్ ఆరిఫ్ ను జిల్లా ప్రెసిడెంట్ గా ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. అలాగే ఈ సందర్భంగా నూతనంగా ఉమెన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డ ఆరిఫ్ మాట్లాడుతూ.. తనపై పూర్తి విశ్వాసంతో మండల స్థాయి వ్యక్తికి జిల్లా స్థాయి అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు హ్యూమన్ రైట్స్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ షాహిన్, ఉమెన్ రైట్స్ సభ్యులకు పూర్తి విశ్వాసంతో పనిచేసి వారి మనసుని గెలుచుకునే స్థాయి నిలుస్తానని ఆరిఫ్ అన్నారు. అనంతరం నూతనంగా జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు ఆరిఫ్ కు ఆలిండియా ఉమెన్ రైట్స్ ప్రెసిడెంట్ అలాగే సభ్యులు పూలమాల సీటు తినిపించి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు మొహమ్మద్ పాషా,అయాన్ మాలిక్,ఫెరోస్,కౌసరి బేగం తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన 10 రోజుల యచ్ సిడిసి శిక్షణ

- యూజీసీ పేపర్ -1 పై శిక్షణ

**విశాల భారతి, సికింద్రాబాద్:**

ఓయూ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ (HCDC) ఆధ్వర్యంలో సెంటర్ లో గత 10 రోజులు గా నిర్వహిస్తున్న యూజీసీ నెట్ అభ్యర్థుల కోసం 10రోజుల ఉచిత శిక్షణ శనివారం సాయంత్రం ముగిసింది. యూజీసీ నెట్ పేపర్ 1 అభ్యర్థుల శిక్షణ కార్యక్రమం ముగిసింది.ఈ కార్యక్రమం డిసెంబర్ 12 నుండి నేటి వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం, CFRD భవనం, HCDC కార్యాలయం ఈ క్లాస్ రూమ్ లో నిర్వహించారు. కార్యక్రమంలో ఓయూ క్యాంపస్ మరియు అనుబంధ కళాశాలల నుండి పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు మరియు నిపుణుల ఆధ్వర్యంలో పేపర్ 1 సిలబస్‌పై విస్తృత అవగాహన కల్పించడమే ఈ శిక్షణా శిబిరం ముఖ్య ఉద్దేశం అన్నారు.HCDC డైరెక్టర్ ప్రొఫెసర్ సి.వి. రంజనీ శిక్షణ ప్రారంభంలో పాల్గొనే విద్యార్థులను,రిసోర్స్ పర్సన్స్ ఆహ్వానించారు. ముగింపు సందేశంలో ఆమె యూజీసీ నెట్ పరీక్షలో పేపర్ 1 ప్రాధాన్యత గురించి ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్తు కోసం ఈ శిక్షణా కార్యక్రమం వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. డా. నాగి రెడ్డి పుట్లూరి, ప్రొఫెసర్ మరియు అకడమిక్ డైరెక్టర్, బైలర్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్, USA, విద్యార్థులకు ప్రతిపాదన చేసి, వారి లక్ష్యాలను సాధించడంలో ఈ కార్యక్రమాన్ని ఉపయోగపడేలా చేయమని సూచించారు. డా. పి. మురళీధర్ రెడ్డి, కోఆర్డినేటర్, HCDC, సమయ నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులను కోరారు. విద్యార్థుల సానుకూల అభిప్రాయాల మధ్య కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. విద్యార్థులకు సర్టిఫికేట్ లను పంపిణీ చేసి,శిక్షణ కార్యక్రమం ముగిసింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా

ఆదివారం,
29.12.2024
హైదరాబాద్



cinema updates



## గోదారి గట్టు కు 50 మిలియన్ వ్యూస్

విక్టరీ వెంకటేష్ హైలీ యాంటిసిపేటెడ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా చుట్టూ ఎక్సయిట్మెంట్ నెక్స్ట్ లెవెల్ చేరుకుంది. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ నిర్మించిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఈ సంక్రాంతి కానుకగా జనవరి 14న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సినిమా ఇప్పటికే మ్యూజికల్ ప్రమోషన్స్‌తో సంచలనం సృష్టించింది, మొదటి రెండు పాటలు సెన్సేషనల్ హిట్‌గా నిలిచాయి. వెరీ ట్యాలెంటెడ్ భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఫస్ట్ సింగిల్ గోదారి గట్టు సాంగ్ రమణ గోగుల మధు ప్రియ ప్లజెంట్ వోకల్స్, భాస్కరభట్ల ఆకట్టుకునే సాహిత్యంతో మెస్మరైజింగ్ మెలోడీగా నిలిచింది. వెంకటేష్, ఐశ్వర్య రాజేష్ మధ్య బ్యూటీఫుల్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేసే పాట ఫ్యాన్స్ లో ఇన్స్టంట్ ఫేవరేట్ హిట్ గా నిలిచింది. గోదారి గట్టు వెంకటేష్ కెరీర్‌లో ఫాస్టెస్ట్ రికార్డ్ సాధించింది, సీనియర్ హీరోలలో కేవలం3 వారాల్లోనే 50 మిలియన్ వ్యూస్‌ను రీచ్ అయిన ఫాస్టెస్ట్ సాంగ్‌గా నిలిచింది. ఈ ట్రాక్ పాపులారిటీ సోషల్ మీడియా సంచలనంగా మార్చింది, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో, అభిమానులు, ఇన్ఫ్లూయనర్స్ రొమాంటిక్ నంబర్‌పై వారి వోన్ టేక్ ని షేర్ చేస్తున్నారు.

'మ్యాడ్ స్క్వేర్' చిత్రం కోసం తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. 2023 లో విడుదలైన మ్యాడ్ మొదటి భాగం సంచలన విజయం సాధించడంతో, కేవలం ప్రకటనతోనే రెండవ భాగంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా 'మ్యాడ్ స్క్వేర్' ప్రచార చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా 'మ్యాడ్' విజయంలో సంగీతం కీలక పాత్ర పోషించింది. దీంతో 'మ్యాడ్ స్క్వేర్' పాటలపై ప్రేక్షకుల్లో ఎంతో ఆసక్తి ఉంది. 'లడ్డు గాని పెళ్లి' అంటూ ఈ చిత్రం నుంచి విడుదలైన మొదటి గీతంకి విశేష స్పందన లభించింది. ఇప్పుడు రెండవ గీతంగా 'స్వాతి రెడ్డి' అంటూ సాగే పాటను విడుదల చేసింది చిత్ర బృందం. 'లడ్డు గాని పెళ్లి' తరహాలోనే విన్న వెంటనే కట్టిపడేసేలా ఎంతో ఉత్సహంగా ఈ గీతం సాగింది. మొదటి భాగంలో 'కళ్ళజోడు కాలేజ్ పాప' వంటి బ్లాక్ బస్టర్ పాటతో ఒక ఊపు ఊపిన భీమ్స్ సిసిరోలియో, 'స్వాతి రెడ్డి'తో మరోసారి తన సత్తా చాటారు. రాబోయే రోజుల్లో ఈ పాట తెలుగునాట ఒక ఊపు ఊపడం ఖాయంగా చెప్పవచ్చు. ఉత్సాహభరితమైన సంగీతం అందించడమే కాకుండా, అంతే ఉత్సాహంగా స్వాతి రెడ్డితో కలిసి ఈ పాటను ఆలపించారు భీమ్స్. ఇక సురేష్ గంగుల సాహిత్యం ప్రేక్షకుల నాడిని పట్టుకున్నట్టుగా ఉంది. అందరూ పాడుకునేలా తేలికైన పదాలతో అద్భుతమైన సాహిత్యం అందించారు. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ల త్రయం మరోసారి నవ్వించడానికి వస్తున్నారు. మొదటి భాగానికి మించిన వినోదాన్ని పంచడానికి ఈ ముగ్గురు సిద్ధమవుతున్నారు. అదే ఉత్సాహం తాజాగా విడుదలైన రెండవ గీతంలోనూ కనిపించింది. ఇక ఈ పాటలో రెబా మోనికా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పాట ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.



## 'మ్యాడ్ స్క్వేర్' రెండో పాట విడుదల



## ఎవరో ఒకరు రాజీ పడాల్సిందే!

ప్రేమలో రెండు సార్లు విఫలమైన కారణంగా మనశ్శాంతిని కోల్పోయినట్లుంది చెన్నై చందమామ శ్రుతిహాసన్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, రిలేషన్, పెళ్లి అంశాలపై ఆమె ప్రస్తావించిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమైంది. 'ప్రేమలో ఉన్నప్పుడు బాగానే ఉంటుంది. అభిప్రాయబేధాల వల్ల అంతరాలు పెరుగుతున్నప్పుడు ఓ బాధ. విడిపోయిన తర్వాత ఓ బాధ. ఇది అనుభవించిన వారికే తెలుస్తుంది. పెళ్లి అనే కట్టుబాటు బంధాలను శాశ్వతం చేస్తుందంటే కూడా నేను నమ్మను. ఎవర్నీ బలవంతంగా కలిపి ఉంచలేం. మా అమ్మానాన్న ప్రేమించే పెళ్లి చేసుకున్నారు. చాలా అందమైన జంట. ఈ ప్రపంచంలో ఉత్తమ జంట మా అమ్మానాన్నే అనుకునేదాన్ని. ఇద్దరూ చాలాకాలం కలిసున్నారు. ఆ టైమ్‌లో మా ఇల్లు చాలా బావుండేది. ఉన్నట్టుండి విడిపోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. అయినా కలిసి ఉండటానికి ప్రయత్నించారు. కానీ కుదర్లేదు. పరిస్థితులకు ఎదురొడ్డి గెలవలేం. ఎవరో ఒకరు రాజీ పడితే తప్ప బంధాలు నిలవవ్. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లేవ్. అందుకే పెళ్లిపై నాకు సదాభిప్రాయం లేదు' అని తేల్చేసింది శ్రుతిహాసన్.



## "డ్రింకర్ సాయి" ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణ పొందడం సంతోషంగా ఉంది - సక్సెస్ మీట్‌లో మూవీ టీమ్

ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా "డ్రింకర్ సాయి". బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ నెల 27న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చిన "డ్రింకర్ సాయి" సినిమా యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణతో విడుదలైన అన్ని చోట్ల విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈరోజు "డ్రింకర్ సాయి" సినిమా సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ - నేను ఈ మూవీకి ప్రొడ్యూసర్ అయినా ఫస్ట్ టైమ్ మీడియా ముందుకు వస్తున్నాను. భారత సేవా సహకార ఫోరమ్ అనే సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నా. లాక్ డౌన్ లో నేను చేసిన సేవలకు మాస్క్ మ్యాన్ ఆఫ్ ఇండియా అనే అవార్డ్ వచ్చింది. పద్మశ్రీ పురస్కారానికి ఫైనల్ లిస్ట్ దాకా నా పేరు వెళ్లింది. ఇలాంటి నేపథ్యమున్న నేను డ్రింకర్ సాయి టైటిల్ తో సినిమా చేసినప్పుడు కొందరు మిత్రులు సందేహాలు వెలిబుచ్చారు. కానీ ఈ సినిమా ద్వారా ఒక మంచి సందేశాన్ని ఇస్తున్నామని వారికి చెప్పాను. మంత్రి శ్రీధర్ బాబు గారు మా మూవీ పోస్టర్ లాంఛ్ చేశారు. డ్రింకర్ సాయి సినిమాకు మంచి వసూళ్లు వస్తున్నాయి. మేము పెట్టిన పెట్టుబడి సేఫ్ అయ్యింది. లాభాలు కూడా వస్తాయి. అయితే వీటన్నింటికంటే ఒక మంచి సందేశాత్మక సినిమా చేశామనే సంతృప్తి ఉంది. డైరెక్టర్ కిరణ్ ను సెట్ లో చూశాను. ఎంతో డెడికేటెడ్ గా, ప్రతిభావంతంగా పనిచేశాడు. అలాగే హీరో ధర్మ ప్రతి పనిలో తాను ఇన్వాల్వ్ అయి చేశాడు. హీరోయిన్ ఐశ్వర్యను మా సొంత అమ్మాయిలా చూసుకున్నాం. మా అబ్బాయి లహరిధర్ ప్రొడక్షన్ పనులన్నీ చూసుకున్నాడు. అలాగే ఇస్మాయిల్ ప్రొడక్షన్ లో భాగమయ్యారు. మా టెక్నీషియన్స్ అంతా ప్యాషనేట్ గా వర్క్ చేశారు. మా "డ్రింకర్ సాయి" సినిమాకు విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. అన్నారు. ప్రొడ్యూసర్ బసవరాజు లహరిధర్ మాట్లాడుతూ - "డ్రింకర్ సాయి" సినిమాకు వస్తున్న రెస్పాన్స్ పట్ల మా టీమ్ అంతా సంతోషంగా ఉన్నాం. మా డైరెక్టర్, హీరో, ఇతర టీమ్ పడిన కష్టానికి ఫలితం దక్కింది. యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ సినిమాను చూసి బాగుందని అంటున్నారు. మా మూవీకి మీ సపోర్ట్ ఇలాగే కొనసాగాలి. అన్నారు,

## "నింద" కి అంతర్జాతీయ స్ట్రీమింగ్ కి ఆమోదం



వరుణ్ సందేశ్ హీరోగా వచ్చిన థ్రిల్లర్ నింద ఇప్పటికీ ట్రెండ్ అవుతూనే ఉంది. ఈ చిత్రం ఇప్పుడు ఎమిరేట్స్, మలేషియన్ ఎయిర్‌లైన్స్‌లో ప్రసారం చేయడానికి ఆమోదించారు. దీంతో అంతర్జాతీయ ప్రేక్షకులకు విస్తరించబోతోంది. సెప్టెంబర్ 6న ETV విన్‌లో విడుదలైనప్పటి నుంచీ ట్రెండ్ అవుతున్న ఈ మూవీ ఇప్పటికే 35 మిలియన్లకు పైగా స్ట్రీమింగ్ మినిట్స్ క్రాస్ చేసింది. యదార్థ సంఘటనల ఆధారంగా నింద మూవీని ది ఫెర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ జగన్నాథం దర్శకత్వం వహించి, నిర్మించారు. గ్రిప్పింగ్ కథనంతో అందరినీ ఆకట్టున్నారు. ఈ సినిమాలో అన్నీ, శ్రేయ, తనికెళ్ల భరణి, భద్రం వంటి వారు ముఖ్య పాత్రలను పోషించారు. సినిమాటోగ్రాఫర్ రమీజ్ నవీత్ అద్భుతమైన విజువల్స్, సంతు ఓంకర్ హాంటింగ్ స్కోర్, అనిల్ కుమార్ చేసిన ఎడిటింగ్...నింద మూవీని స్లో బర్న్ స్టోరీ టెల్లింగ్‌లో మాస్టర్ క్లాస్ గా నిలబెట్టాయి. అంతర్జాతీయ స్ట్రీమింగ్ ఆమోదంతో నింద నెక్స్ట్ లెవెల్ కి చేరనుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.